RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 271 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 అక్టోబర్ 2024 గురువారం పేజీలు : 4

## మరో 79 విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ ఆగడం లేదు. ఇలాంటి కాల్స్ చేసే వారికి జీవిత ఖైదు విధించేలా చట్ట సవరణ చేస్తామని, నో ఫ్లై జాబితాలో చేర్చుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా, ఈ బెదిరింపు కాల్స్ ఆగలేదు. గడిచిన 24 గంటల్లో మరో 79 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిలో ఒక్క రోజే 50 విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. ప్రధానంగా అంతర్జాతీయ మార్గాల్లో నడిచే విమానాలకు ఈ కాల్స్ వచ్చాయి. ఇండిగో విమానాలు 23, విస్తారా 21, ఆకాశ 12, ఎయిరిండియాకు చెందిన 23 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటితో కలిసి వారం రోజుల్లో మొత్తం 169 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లయింది.

# నేతలంతా బిజీ..బిజీ...

## తెలంగాణలో మరో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక..

## ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమైన పార్టీలు, అభ్యర్థులు



తెలంగాణలో మరో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక రాబోతుంది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్‌కు త్వరలోనే నోటిఫికేషన్ రాబోతుంది. అయితే ఇప్ప టికే పార్టీలు, పలువురు ఆశావహులు ప్రచారంలో బిజీగా ఉన్నారు. బీఆర్ఎస్ మాత్రం కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటులో పోటీపై డైలమాలో ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి..వరంగల్ గ్రాడ్యుయేట్ బైపోల్‌లో ఓటమి తర్వాత పరిస్థితుల నేపథ్యంలో పోటీ చేయాలా వద్దా అని ఆలోచిస్తున్నట్లు టాక్. పోటీ చేస్తే ఎలా ఉంటుంది.? గెలుపు అవకాశాలు ఉన్నాయా.? ఓడితే పార్టీపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే దానిపై పక్కాగా సర్వేలు చేస్తోందట.

**బరిలో నిలవకపోతేనే బెటరా? :** ఎమ్మెల్సీ బరిలో నిలవకపోతేనే బెటరనే భావనలో గులాబీ పెద్దలు ఉన్నట్లు టాక్. ఆశావహులు మాత్రం పోటీ చేస్తేనే సత్తా చాటుకోవచ్చని..మొదటి నుంచి కారు పార్టీకి కలిసి వచ్చిన కరీంనగర్ స్థానంలో మళ్లీ పాగా వేయడం ద్వారా పూర్వవైభవం తెచ్చుకోవచ్చని పార్టీ పెద్దలను కోరుతున్నారట. ఎవరెన్ని చెప్పినా గులాబీబాస్ కేసీఆర్ మదిలో ఏం ఉందన్నది మాత్రం అంతుచిక్కడం లేదంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు, బీజేపీ బలమైన అభ్యర్థులను బరిలో దించేందుకు రెడీ అవుతున్నాయి. గతంలో ఈ ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థులు వరుసపెట్టి గెలిచారు. నారదాసు లక్ష్మణ్, స్వామిగౌడ్.. ఇలా వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. అయితే తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో మాత్రం కారు పార్టీ అధికారికంగా అభ్యర్థిని బరిలో దింపలేదు. స్వతంత్ర అభ్యర్థి, ఉద్యోగ సంఘం నేత చంద్రశేఖర్‌గౌడ్‌కు మద్దతు తెలిపింది. ఆ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలిచారు. అలా బీఆర్ఎస్ కంచుకోటను కైవసం చేసుకున్న కాంగ్రెస్.. ఈసారి ఎలాగైన సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని పావులు కదుపుతోంది. ఇక కేంద్రమంత్రి సంజయ్‌తో పాటు ముగ్గురు ఎంపీలు రఘునందన్‌రావు, అరవింద్, నగేష్‌లతో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్న పట్టభద్రుల నియోజకవర్గాన్ని ఎలాగైనా గెలిచి తీరాలని బీజేపీ వ్యూహ రచన చేస్తోంది.

**ఇంతకు ముందు జరిగిన ఎన్నికల్లో..** అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. పార్లమెంట్ ఎన్నికల్లో బోణీనే కొట్టలేదు. ఇక వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చినా గెలువ లేకపోయింది. దీంతో కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎన్నిక బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారింది. దీని పరిధిలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల నియోజకర్గాలు కూడా ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిస్తే పార్టీ బలోపేతానికి దోహద పడుతుందని కొందరు నేతలు అంటున్నారు. కానీ మరోసారి ఓటమి పాలైతే పార్టీ జనాల్లో పలుచనపడే అవకాశం ఉందన్న చర్చ ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో సాహసం చేయడం ఎందుకనేది అధినేత ఆలోచనగా తెలుస్తుంది. పోటీ విషయంలో అధిష్టానం డైలమాలో ఉన్నప్పటికీ ..కరీంనగర్ మాజీ మేయర్, రవీందర్ సింగ్ మాత్రం పోటీకి రెడీ అయిపోతున్నారు. కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే రంగంలోకి దిగాలని ఆసక్తిరేపుతోంది. మరికొందరు తటస్థులు , డాక్టర్లు, టీచర్లు కూడా బీఆర్ఎస్ టిక్కెట్ ప్రయత్నం చేస్తున్నారు. అయితే కేసీఆర్‌కు సన్నిహితుడిగా ఉండే రవీందర్‌సింగ్ పోటీకి సిద్ధం అవుతుండటం కరీంనగర్ రాజకీయాన్ని కాకపుట్టిస్తోంది. కేసీఆర్ నో అంటే..రవీందర్ సింగ్ ఏం చేస్తారన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. ఇంతకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బరిలో నిలుస్తుందా.? తప్పుకుంటుందా.? అనేది మాత్రం నోటిఫికేషన్ వస్తేనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.





## కొత్త అసెంబ్లీ నిర్మాణానికి రేవంత్ ప్లాన్స్.. కోమటిరెడ్డి కీలక ప్రకటన

తెలంగాణలో కొత్త అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని డిసైడైంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. తెలంగాణ రాజసం ఉట్టిపడేలా ఈ నిర్మాణం వుండాలని అనుకుంటోంది. నిజాం నిర్మించిన భవనం తరహాలోనే.. రాజసం ఉట్టిపడేలా అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్టు తెలంగాణ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. ఈ పునర్నిర్మాణ పనులు 3 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా పార్లమెంట్ సెంట్రల్ తరహాలో అసెంబ్లీ, కౌన్సిల్ భవనాలు ఒకే దగ్గర ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం.. అసెంబ్లీ నుంచి కౌన్సిల్‌కు వెళ్లాలంటే.. వాహనాలు ఉపయోగించక తప్పడం లేదని చెప్పుకొచ్చారు. రెండు భవనాలు ఒకే దగ్గర ఉంటే సమయం ఆదా అవుతుందని అభిప్రాయపడ్డారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.




## సోనియా గాంధీని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

కేరళలోని వయనాడ్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రియాంకా గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ తరపున ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరు అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీతో సమావేశమయ్యారు. రాష్ట్ర రాజకీయాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఇదిలా ఉండగా.. నామినేషన్ దాఖలుకు ముందు వయనాడ్ బాధితులకు కాంగ్రెస్ నేతలు నివాళులు అర్పించారు. ప్రకృతి విలయం వల్ల ప్రాణాలు కోల్పోయిన బాధితుల సమాధుల వద్ద అంజలి ఘటించారు. రెండు నెలల క్రితం కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ముండక్కై, చూరాల్‌మల ప్రాంతాల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# ఏపీ ప్రజలపై వరాల జల్లు

## దీపావళి కంటే ముందుగానే పండగ కానుకల ప్రకటన!

## కేబినెట్ పలు కీలక నిర్ణయాలు




హైదరాబాద్ : ఏపీ సర్కార్ ప్రజా సంక్షేమం దిశగా అడుగులు వేస్తోంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. తాజాగా సూపర్-6 పథకాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన నేడు సమావేశమైన ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దాదాపు 3 గంటల పాటు కేబినెట్ భేటి జరిగింది. అయితే మంత్రివర్గం ఏఏ నిర్ణయాలు తీసుకుందంటే? గత కొన్నిరోజులుగా ఏపీలో ఉచిత ఇసుక పథకం అమలులోకి వచ్చింది. తాజాగా మరోసారి ఈ ఉచిత ఇసుక విధానంలో పలు మార్పులు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దు చేయాలని మంత్రివర్గ తీర్మానించింది. సీనరేజ్ ఛార్జీల వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్లు భారం పడుతుందని మంత్రివర్గం అంచనా వేసింది. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు కూడా అవకాశం కల్పించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు ఖర్చుయ్యే నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చంద్రబాబు మరోసారి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలంటూ జిల్లా మంత్రులు, ఇన్‌ఛార్జ్ మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. మరో పథకానికి కూడా మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు దీపం పథకం అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి ఏటా రూ.2,684కోట్లతో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈనెల 31న ఈ స్కీమ్ను ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మూడు సిలిండర్లను ఇచ్చేందుకు ఒక షెడ్యూల్ను ఖరారు చేశామన్నారు. ఏప్రిల్-జులై మధ్య మొదటి సిలిండర్, ఆగస్టు-నవంబర్ మధ్య రెండోది, డిసెంబర్-మార్చి 31 మధ్య మూడో సిలిండర్ను ఇవ్వనున్నట్లు తెలిపారు.

## సంపాదకీయం

# ‘ఉచిత ఇసుక.. పూర్తిగా ఉచిత ఇసుక’... తేడా తెలుసా?

నవ్యాంధ్రలో 2014లో అధికారం లోకి వచ్చిన తర్వాత టీడీపీ – బీజేపీ ప్రభుత్వం “ఉచిత ఇసుక” విధానాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం.. ఆ పాత విధానాన్ని రద్దు చేసి, కొత్త విధానం తీసుకొచ్చింది. ఇందులో భాగంగా... ఇసుక తవ్వకాలను కాంట్రాక్టర్లకు ఇచ్చింది. ఆ సమయంలో వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్ట్ సంస్థలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. ఇసుక టన్నుకు రూ.375 చొప్పున చెల్లించాలి. దానికి నిర్వహణ ఖర్చుల కింద అదనంగా మరో రూ.100 వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇక వాటికి రవాణా ఖర్చులు అదనం. అయితే ఏపీలో తాజాగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో... ఆంధ్ర ప్రదేశ్ లో 2016 – 19 వరకూ అమలు చేసిన ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ తీసుకొచ్చింది. దీన్ని “ఉచిత ఇసుక” విధానం అని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. డిపో వద్ద టన్ను ఇసుకకు రూ.1,394 చెల్లించాలని అంత పెద్ద బోర్డు పెట్టి “ఉచిత ఇసుక” అని అంటారేంటంటూ ప్రజలు ఫైరయ్యారు.. నెటిజన్లు ట్రోల్ చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుతం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఇసుకను ఇకపై పూర్తిగా ఉచితంగా ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఇసుకపై సీనరేజ్ రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటివరకూ సీనరేజ్, తదితరాల రూపంలో మెట్రిక్ టన్నుకు రూ.88 వసూలు చేసే విధానాన్ని రద్దు చేశారు! ఈ నిర్ణయం అమలుకు సంబంధించి గనులశాఖ అధికారులతో సీఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయానికి ఆమోదం తెలపనున్నారు. వాస్తవానికి సీనరేజ్ ఫీజు కింద మెట్రిక్ టన్నుకు వసూలు చేస్తున్న రూ.88లో... జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు జమయ్యేది రూ.66 సీనరేజ్ ఫీజు కాగా.. జిల్లా ఖనిజ నిధికి చేరేది రూ.20, ఖనిజాన్వేషణ ట్రస్ట్ కు వెళ్లేది రూ.2! ఈ మొత్తం కలిపి రూ.88 ను ఇకపై వసూలు చేయరన్నమాట. దీంతో... తమ తమ నిర్మాణ అవసరాల మేరకు నదీ సమీప గ్రామాలు, పట్టణాలకు చెందినవారు ఇసుక తవ్వి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో ఉచితంగా ఇసుకను తీసుకెళ్లొచ్చు. ఒకవేళ సంబంధిత రీచ్ లలో కూలీలతో ఇసుక తవ్వించి లోడ్ చేయించాలనుకుంటే అక్కడ ఉన్న కాంట్రాక్టర్ కు ప్రభుత్వం నిర్ధేశించిన టన్నుకు రూ.90–100 చెల్లించాల్సి ఉంటుంది.

# గ్రూప్ - 1 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : కీసర మండలంలోని చీర్యాల లో గల గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న గ్రూప్ - 1 పరీక్ష నిర్వహాణను బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం తనిఖీ చేసారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతు ందా, సిసి కెమెరాలు పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదులలో తిరిగి పరీక్షల నిర్వహాణను పరిశీలించారు. ఈ పర్యటనలో కాలేజీ ప్రిన్సిపల్ సూసర్ల ఉదయ కుమార్, ఎగ్జామ్స్ కంట్రోలర్ దేవయ్య, కీసర ఎంఆర్ఓ అశోక్ కుమార్, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# డిజిటల్ క్రాప్ సర్వే సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం పునరాలోచించాలి





శామీర్ పేట, (గరుడ వార్త) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వే సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని రాష్ట్ర వ్యవసాయ ఏఈఓల ఆడహక్ కమిటీ చైర్మన్ బాదావత్ రాజ్ కుమార్ కోరారు. 167 మంది వ్యవసాయ ఎఈఓలను ప్రభుత్వం తొలగించిన సందర్భంగా వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ఎఈఓల అడహక్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో నగరం లోని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్, కమీషనర్ కార్యాలయం వద్ద ఏఈఓలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అనంతరం బుధవారం సాయంత్రం శామీర్ పేట మండలం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్రెడ్డి ఫంక్షన్ హాల్లో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎఈఓల అడహక్ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 167 మంది ఎఈఓలపై ప్రభుత్వం వేసిన సస్పెన్షన్ వేటును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ఇతర రాష్ట్రాల్లో ఎజెన్సీలతో పంటల సర్వే నిర్వహిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం లో ప్రభుత్వం అందుకు బిన్నంగా వ్యవహరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆలయ రహదారి విస్తరణకు అడుగులు



వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోనుంది. రహదారి విస్తరణలో నష్టపోయే ఇళ్లకు సంబంధించి భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రోడ్డు విస్తరణకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఇది జరిగితే పట్టణ ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరనుంది.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. వీరితోపాటు స్థానికులతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. పలు సందర్భాల్లో ఈ రహదారి పద్మవ్యూహాన్ని తలపిస్తుంటుంది. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడటం సర్వసాధారణమైంది. ఈ రహదారిని ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ వంతెన వరకు విస్తరించాలన్న ప్రతిపాదనలు గత కొన్నేళ్లుగా కార్యరూపం దాల్చడం లేదు.గత ఏడాది రెవెన్యూ, ఆర్అండ్‌బీ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ), సర్వే అధికారులు సర్వే చేసి అంచనాలు రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణకు రూ.35 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా నిధులు విడుదల కాక పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టడంతో ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. తిరిగి సర్వే నిర్వహించి విస్తరణ పనులు చేపట్టనున్నారు. దీంతో ఈసారి రహదారి విస్తరణకు మోక్షం లభించనుందని భావిస్తు న్నారు.

నష్టం ఏర్పడే ఇళ్ల సంఖ్య 243 : రహదారి విస్తరణతో ఆలయం ముందు నుంచి మూలవాగు వంతెన వరకు దాదాపు 243 ఇళ్లకు నష్టం ఏర్పడనున్నదని అధికారులు అంచనా వేశారు. 80 అడుగుల వరకు విస్తరించనున్నారు. బాధితులకు పరిహారం కింద దాదాపు రూ.47 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. రెండు నెలల్లో సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఇవీ ఇబ్బందులు : రాజన్న దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండటంతో వాహనాలు కూడా దాదాపు వేయి వరకు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. వీరితో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం పట్టణానికి వస్తుంటారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఈ ప్రాంతంలోని వారు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. కొన్ని సందర్భాల్లో కనీసం పాదచారులు కూడా వెళ్లలేనంత రద్దీ ఉంటుంది. రాజన్న ఆలయంలో జరిగే వివిధ ఉత్సవాల సమయంలో జన సంద్రంగా మారుతుంది. ఇలాంటి సందర్భంలో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. రహదారి విస్తరణతో ఈ ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

రెండు నెలల్లో సర్వే పూర్తి – రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ

రాజన్న ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ వంతెన వరకు రహదారి విస్తరణకు భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు నెలల్లో రహదారి విస్తరణలో కోల్పోయే ఇళ్లను సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నాం. నివేదిక ఆధారంగా ప్రభుత్వం రహదారి విస్తరణ పనులకు చర్యలు చేపట్టనున్నది.

# పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత

కరీంనగర్ : ప్రస్తుతం పల్లెలతోపాటు పట్టణాల్లోనూ జ్వరాల తీవ్రతతో ప్రజలు అల్లాడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో పల్లె దవాఖానాలు, పట్టణ కేంద్రాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి వైద్యులను నియమించింది. రెండేళ్లపాటు స్థానికంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందగా ఇటీవల ఉన్నత చదువుల కోసం కొందరు, ఇతర కారణాలతో కొందరు వైద్యులు విధులకు స్వస్తి పలకడంతో ఆయా దవాఖానాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు మెరుగైన వైద్యం అందక.. పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం తీసుకోలేక అనారోగ్యంతో మంచం పడుతున్నారు.

ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు దూలం రాజమ్మ. బూర్గుపల్లికి చెందిన ఈమెకు జ్వరం రాగా స్థానికంగా ఉన్న పల్లె దవాఖానాకు వెళ్లింది. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వైద్యుడిని ఆశ్రయించి వైద్యం పొందారు. ఇందుకు ఆర్థికంగా భారమైంది. ఇక్కడి వైద్యుడు నాలుగు నెలలుగా లేకపోగా ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. రెండో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటున్నారు.

ఖాళీలు ఇవీ.. జిల్లాలో పల్లె దవాఖానాలు 97 ఉండగా 12 చోట్ల వైద్యుల్లేరు. అత్యధికంగా గంగాధర మండలం ఉప్పరమల్యాల, గర్శకుర్తి, గట్టుబూత్కూర్, బూర్గుపల్లి గ్రామాల్లో వైద్యుల్లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని నాలుగు బస్తీ దవాఖానాల్లో వైద్యులు ఉన్నారు. 6 అర్బన్ ఆరోగ్య కేంద్రాలకుగాను హౌసింగ్‌బోర్డు కాలనీ, మోర్రజ్‌ఖానాలో వైద్యుల్లేరు. జిల్లాలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకుగాను ప్రధానంగా మానకొండూరు, చిగురుమామిడి, శంకరపట్నం, చల్లూరు ఆరోగ్య కేంద్రాలకు వైద్యుల్లేక ఆయా మండ



లాల ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందడంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరితోపాటు ఆసుపత్రుల్లో ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ అసిస్టెంట్, ఆరోగ్య సూపర్‌వైజర్ల నియామకం జరగక వైద్యసేవలు అందడంలేదు. మధుమేహం, రక్తపోటు మందులు అందుబాటులో ఉండడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 104 వాహనం వచ్చిన సమయంలో మాత్రమే మందులు ఇవ్వగా కొన్నేళ్లుగా వాహనం ఊళ్లోకి రావడం లేదని, మందులు ఇచ్చేవారే లేరని వ్యాధిగ్రస్తులు ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

– డాక్టర్ సుజాత, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి

పల్లె దవాఖానాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో నియామకాలు త్వరలోనే చేపడతాం. ఖాళీలు ఉన్నచోట పక్క ప్రాంతాల వైద్యులకు అదనపు బాధ్యతలు అప్పగించి సేవలందిస్తున్నాం. వైద్యసేవల పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నాం.

# ఉబికి వస్తున్న కన్నీళ్లు

గంగాధర: వారి ఇళ్లలో నీరు ఉబికి వస్తోంది. గోడలు తడిసి నిత్యావసరాలు పాడవుతున్నాయి. ఇంట్లోంచి నీటిని బయటకు ఎత్తిపోస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే దుస్థితి అని నారాయణపూర్, గంగాధర జలాశయాల ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉండటంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలంలో అయితే ముంపు గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. తమ ఊళ్లను స్వాధీనం చేసుకుని పునరావాసం కల్పించాలని వేడుకుంటున్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి నారాయణపూర్ గ్రామాన్ని సందర్శించి ముంపు బాధితులకు భరోసా కల్పించారు. కానీ ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు.

పరిహారానికి నిరీక్షణే.. జలాశయం నిర్మాణంలో కోల్పోయిన 236 ఎకరాల వ్యవసాయ భూములతోపాటు బావులు, పైపులైన్లకు నష్టపరిహారం చెల్లించాలి. పదేళ్ల కిందటే రూ.10 లక్షల చొప్పున ప్రకటించినా ఇంతవరకు మంజూరు కాలేదు. మంగపేటలో 11 ఇళ్లు, నారాయణపూర్ చెరువు కట్ట కింద 31 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని గతంలో అధికారులు గుర్తించారు. నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకు ఒక్క పైసా కూడా బాధితులకు చెల్లించలేదు. చర్లపల్లి–ఎన్, ఇస్తారుపల్లి గ్రామాల్లోనూ ముంపు సమస్యలతో ప్రజలు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోటెత్తిన వరద.. ఇళ్లలో ఊట జిల్లాలోని గంగాధర, నారాయణపూర్ జలాశయాలను ఎల్లంపల్లి నీటితో నింపి జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీటిని అందిస్తున్నారు. అయితే 0.3 టీఎంసీల సామర్థ్యం గల ఈ చెరువుల కట్టలను అభివృద్ధి చేయకుండా ఏళ్లుగా నీటిని నింపుతుండటం సమస్యగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారాయణపూర్ చెరువు నిండుకుండలా మారింది. ఇళ్లలో నీటి ఊటలు వస్తుండగా గోడలు తడిసిపోతున్నాయి. రెండేళ్ల కిందట నారాయణపూర్ చెరువు, గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు గండ్లు పెట్టగా వరద ఉద్ధృతితో భయానక పరిస్థితి నెలకొంది. నారాయణపూర్ చెరువు కట్ట వెడల్పు, ఎత్తు పెంచకుండా.. కేవలం చెరువు మత్తడి వద్ద లక్షలాది రూపాయలతో ఎత్తు పెంచడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి కట్టకు సమాంతరంగా వరద చేరింది. ఏ క్షణంలోనైనా కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటంతో ముంపు బాధితులు భయాందోళన చెందుతున్నారు.

వస్తువులన్నీ తడిసిపోతున్నాయి – మ్యాకల లక్ష్మి, నారాయణపూర్

చెరువు కట్ట కింద ఉన్న మా ఇంట్లో నీటి ఊటతో వస్తువులన్నీ తడిసిముద్దవుతున్నాయి. పాములు, తేళ్లు వస్తున్నాయి. ఇంట్లోకి నీరు జాలువారి గోడలు పదునెక్కుతున్నాయి. చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నాం.చెరువు కట్ట నుంచి నీటిజాలు– మర్రి పరశురాములు, నారాయణపూర్

చెరువు కట్ట నుంచి ఇంట్లోకి నీటిజల వస్తుంది. గోడలన్నీ తడిసిపోతుండగా ఇంట్లో నీటిని ఎత్తిపోసుకుంటున్నాం. వేసవిలోనూ నీటిని నింపడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. తమ ఇళ్లను స్వాధీనం చేసుకొని పునరావాసం కల్పించాలి. వర్షాలు కురిసినప్పుడే అధికారులు వచ్చి వెళ్తారు. తర్వాత మరచిపోతారు.ముంపు బాధితులను ఆదుకుంటాం – మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే నారాయణపూర్, మంగపేట గ్రామాల్లో సర్వే చేసి ముంపునకు గురవుతున్న ఇళ్లకు పరిహారం చెల్లిస్తాం. ప్రత్యేక ఆర్అండ్ఆర్ కాలనీలో ఇళ్లు నిర్మించి ఇస్తాం.

# ఎప్పుడు 'దారి'కొచ్చేనో?

కరీంనగర్ : 'ఇలా నిదానంగా పనులు జరిగితే వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది జులై 8న ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ఈ పనులను ఇంత నిర్లక్ష్యంగా కొనసాగించడం సరైన పద్ధతి కాదు. వీలైనంత తొందరగా కరీంనగర్– వరంగల్ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించండి.'

గత నెలలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశం

ఎప్పుడెప్పుడా.. అని ఎదురు చూస్తున్న కరీంనగర్– వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–563) విస్తరణ పనులు ఇంకా సాగుతున్నాయి. ఆగుతూ.. సాగుతూ ముందుకెళ్తున్న ఇక్కడి పనుల్లో మరింత వేగం పెరగాల్సిన అవసరముంది. 'భారత్‌మాల పరియోజన పథకం' కింద కేంద్ర ప్రభుత్వం రూ.2,146.86లక్షల అంచనా వ్యయంతో ఈ రహదారి విస్తరణ చేపడుతోంది. తక్కువ మొత్తంలో భూసేకరణ చేపడుతూ రూపొందిస్తున్న ఈ నిర్మాణం కోసం 305.47 హెక్టార్ల భూమి అవసరం. దాదాపుగా 258 హెక్టార్లను సేకరించడంతోపాటు 47.14 హెక్టార్ల ప్రభుత్వ ఆధీనంలోని భూమిని దారి విస్తరణకు ఉపయోగించుకుంటున్నారు. దాదాపు 30 గ్రామాల ప్రజలకు.. పలు జిల్లాల ప్రయాణికులకు ఈ మార్గం సరికొత్త వసతులతో ఉపయుక్తంగా మారనుంది. జిల్లాలో 46.245 కి.మీ.ల మేర కొత్తదారి నిర్మితమవనుంది. హనుమకొండ జిల్లాలో 21.770కి.మీ ఏర్పడనుంది.

మరో 9 నెలలు..

సరిగ్గా ఇంకో 9 నెలల కాలవ్యవధిలో ఈ దారి పూర్తయి వినియోగంలోకి రావాలి. గడిచిన కొన్ని రోజులుగా నింపాదిగా జరిగిన పనుల్లో ఇటీవల వేగం కనిపిస్తోంది. కానీ ఇప్పటి వరకు కేవలం 45 శాతం పనులే జరిగాయి. పనులను విభజించి అక్కడక్కడ చేపడుతుండటంతో రాత్రివేళ వాహనదారులు ప్రమాదాల బారిన



పడుతున్నారు. ముఖ్యంగా పనులు పూర్తి కాకపోవడంతో పొలాల మధ్య నుంచి రోడ్డును వేస్తున్న ప్రాంతాల్లో రైతులకు అగచాట్లు ఎదురవుతున్నాయి. పంటచేను వద్దకు వెళ్లడం ఇబ్బందితోపాటు వరి పంట కోతల సమయం అవడంతో ఇబ్బంది నెలకొంది. అందుకనే వీలైనంత తొందరగా ఈ మార్గాన్ని పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా వాసులు కోతున్నారు.

సాగుతున్న తీరిలా..

16 చోట్ల బస్ షెల్టర్లు నిర్మించాలి. ఇందులో ఒకటి రెండు మాత్రమే నిర్మాణ దశలో ఉన్నాయి.

శంకరపట్నం మండలం కొత్తగట్టు సమీపంలో టోల్‌ప్లాజాను ఏర్పాటు చేస్తున్నారు. 15 ఏళ్లపాటు ఇది ఉండనుంది.

పలుచోట్ల మురుగు, వరదనీటి వ్యవస్థతోపాటు నడక మార్గాన్ని 53 కి.మీ.ల మేర ఏర్పరుస్తున్నారు.

సరిహద్దు గోడలతోపాటు చిన్నపాటి ప్రహరీలను 13.16 కి.మీ.ల దూరం ఏర్పాటు చేయాలి.ఒక ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి), ఒక ఆర్‌యూబీ (రోడ్డు అండర్ బ్రిడ్జి) నిర్మాణం జరుగుతోంది.

మొత్తంగా ఈ మార్గంలో 6 పెద్దవి, 20 చిన్న వంతెనలు నిర్మించాలి. సగం అయ్యాయి.బాక్స్ బ్రిడ్జిలు 112 చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉండగా 80 వరకు పూర్తయ్యాయి.

# గాడిన పడనున్న బడి

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా అడుగులు పడుతున్నాయి. బోధనలో ప్రమాణాలు పెంచేందుకు ఖాళీలను భర్తీ చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో విషయ నిపుణుల కొరత లేకుండా, ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడకుండా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేశారు. పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించారు. ఖాళీగా ఉన్న పోస్టులు ఇటీవల భర్తీ కావడంతో సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

పర్యవేక్షణ మెరుగు

పాఠశాల విద్యలో కీలకమైన ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉండటం బోధనపై ప్రభావం చూపుతోంది. గతంలో ఒక్కో ఎంఈవో మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు చూసేవారు. ఏళ్లుగా రెగ్యులర్ అధికారుల నియామకం లేక సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జులుగా వ్యవహరించారు. జిల్లాలో 14 మండలాలకు కలిపి అయిదుగురు ఎంఈవోలు మాత్రమే పని చేశారు. ప్రస్తుతం అన్ని మండలాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయుడికి నోడల్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. బోధన, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీపై పర్యవేక్షణ



మెరుగుపడనుంది.కొత్తగా 73 మంది చేరిక

జిల్లాలోని వివిధ కేటగిరీల్లో 93 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా తాజా నియామకాల్లో 73 మంది చేరారు.

ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం వంటి ప్రధాన విషయాలకు సంబంధించి స్కూల్‌అసిస్టెంట్ పోస్టులు భర్తీ అయ్యాయి.

కొన్ని పాఠశాలలకు కొత్తగా పోస్టులు మంజూరు చేసి ఉపాధ్యాయులను కేటాయించారు.

170 ఖాళీలుజిల్లాలో మొత్తం 516 ప్రభుత్వ పాఠశాలలుండగా 28 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2,275 మంది ఉపాధ్యాయులు బోధిస్తుండగా పలు చోట్ల ఖాళీలున్నాయి. సుమారు 170 ఖాళీలుండగా వీటిలో 120 ఎస్జీటీలు, 50 స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. వీటిని భర్తీ చేస్తే బోధనకు పూర్తి స్థాయిలో ఇబ్బందులు తీరతాయి.సర్దుబాటుతో కొరత తీరింది

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత లేకుండా సర్దుబాటు చేశాం. కొత్త ఉపాధ్యాయుల రాకతో పాఠశాలల్లో బోధన మెరుగవుతుంది. నోడల్ అధికారుల నియామకంతో పర్యవేక్షణ పెరిగింది.

మాధవి, జిల్లా విద్యాధికారి

# సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా




హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా అంటున్నారు. క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ.. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది.

దిగుబడి ఇలా..ఉమ్మడి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకొచ్చారు. మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. సన్నాలకు కేంద్రం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళతాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

కానీ సన్న ధాన్యం మిల్లింగ్‌కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఈ సమస్య కొలిక్కి వచ్చిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రారైస్ మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు తనుకు సురేశ్ తదితరులు కోరుతున్నారు. ఇదీ సమస్య సాధారణంగా దొడ్డు రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు.

దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాలని ప్రభుత్వం అంటుందని చెబుతున్నారు.

సన్నరకాలను తీసుకొని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోతామని వాపోతున్నారు.

అందుకే తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు.

క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు.

దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ ఛార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యల తమను వేధిస్తున్నాయని అంటున్నారు.రారైస్ క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారని, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు.

# చోరీలు పరిపాటి.. రికవరీ ఏపాటి?



కరీంనగర్ : జగిత్యాల జిల్లాలో మూడు నెలలుగా చోరీలు పెరిగాయి. ఇళ్లతో పాటు చిన్న ఆలయాలు, దుకాణాల్లోకి చొరబడుతూ దొంగలు అందిన కాడికి దోచుకెళ్తున్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 302 చోరీలు జరిగాయి. సగటున రెండు రోజులకో కేసు నమోదైంది. సిరిసిల్ల జిల్లాలోనూ అడపాదడపా చోరీ ఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా కేసుల్లో దొంగలు చేతివాటం చూపారు. ఈ ఏడాది జులై 7న పట్టపగలే అలుగునూరులో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు 8 తులాల బంగారు ఆభరణాలు సహా రూ.46 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం సభ్యులు ఇప్పటివరకూ దొంగలను గుర్తించలేదు. రెండు, మూడు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేశారు. బాధితులు మాత్రం ఠాణా చుట్టూ తిరుగుతున్నారు.

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 2022లో అన్ని రకాల చోరీలు కలిపి 248 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఎఫ్ఐఆర్‌లు నమోదైనవి. కేసు కాకుండా బాధితులు వెనుదిరిగినవి మరో 200 వరకుంటాయి. 2023లో 330 చోరీలు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకే ఆ సంఖ్య 300 దాటింది. గతేడాది రూ.2 కోట్ల విలువైన సొత్తు చోరీకి గురి కాగా పోలీసులు రూ.94,91,786ను మాత్రమే తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతేడాది నమోదైన 327 కేసుల్లో 158 మాత్రమే ఛేదించారు. రూ.1.58 కోట్లు పోగా రూ.59.70 లక్షలు బాధితులకు ఇప్పించగలిగారు. రూ.కోటి వరకు రికవరీ కాలేదు. అంతకుముందు ఏడాది(2022)లో 114 ఘటనల్లో దొంగలు పట్టుబడ్డారు. 121 కేసుల అతీగతి లేదు. రూ.45.04 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది 200 వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

పెద్దపల్లి జిల్లాలో 2022లో 679 చోరీలు జరిగాయి. బాధితులు రూ.4.47 కోట్లు పోగొట్టుకోగా రూ.59.21 లక్షలు మాత్రమే తిరిగి ఇప్పించగలిగారు. గతేడాది 725 ఎఫ్ఐఆర్‌లు నమోదై రూ.1.99 కోట్లు పోగా రూ.40.99 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

జగిత్యాల జిల్లాలో గతేడాది 113.2 తులాల బంగారు ఆభరణాలను, 1508 తులాల వెండి ఆభరణాలను బాధితులకు అందించగలిగారు. మరో 80 తులాల ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉంది.

పోయింది ఎక్కువ.. ఫిర్యాదులో తక్కువ చోరీ ఘటనల్లో బాధితులు ఎక్కువ మొత్తం పోగొట్టుకున్నా పోలీసులు వారితో తక్కువ మొత్తాన్ని ఫిర్యాదుల్లో రాయిస్తున్నారు. రూ.లక్ష కన్నా ఎక్కువ ఉండకుండా చూస్తున్నారు. పెద్ద కేసులపై దృష్టి సారిస్తూ చిన్న చోరీ ఘటనల విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఆలయాల్లో దొంగతనాలు జరిగినప్పుడు తక్కువ మొత్తంలో సొత్తు పోయినట్లు నమోదు చేస్తున్నారు. రికవరీ అయినప్పుడు పూర్తిగా ఇప్పిస్తామని బాధితులను ఒప్పించి ఫిర్యాదులు రాయిస్తున్నారు. ఇక రూ.వేలల్లో పోయిన సొత్తుకైతే కేసులే నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

# రాబందుల సంరక్షణకు అష్టకష్టాలు

హైదరాబాద్: అంతరించిపోతున్న రాబందుల జాతిని సంరక్షించేందుకు నెహ్రూ జూపార్కు చేస్తున్న ప్రయత్నం ఫలించడం లేదు. కేంద్ర జూ అథారిటీ(సీజడ్ఏ) నిపుణులు, జూపార్కు అధికార యంత్రాంగం 15 ఏళ్లుగా చేస్తున్న శ్రమ వృథా అయింది. సీజడ్ఏ కూడా సంతానోత్పత్తి కేంద్రానికి ఏడాది కిందట ఆర్థిక సాయాన్ని నిలిపేసింది. ఈ నేపథ్యంలో క్యూరేటర్ సునీల్ ఎస్ హరేమత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. శాస్త్రీయ కారణాలను విశ్లేషిస్తూ సంతానోత్పత్తి కేంద్రానికి 10 జతల కొత్త రాబందులను ఇవ్వాలంటూ సీజడ్ఏకు లేఖ రాశారు. రాబందుల సంరక్షణ కేంద్రానికి ఆర్థికసాయాన్ని పునరుద్ధరించాలనివిజ్ఞప్తి చేశారు.

మానవ తప్పిదాలతో..

ఆదిలాబాద్, మహారాష్ట్ర సరిహద్దుల్లో మినహా..ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాబందులు కొన్నేళ్లుగా కనిపించడం లేదు. దేశ వ్యాప్తంగానూ ఇదే పరిస్థితి ఉంది. కేంద్ర జూ అథారిటీ వాటి సంఖ్యను ఎలాగైనా పెంచాలన్న ఉద్దేశంతో హర్యానాలోని పింజోర్ జూపార్కులో, నగరంలోని నెహ్రూ జూపార్కులో సంతానోత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాంతోపాటు అంతరించిపోయే దశలోని మూషిక జింకల సంతానోత్పత్తి కేంద్రం కూడా నగరంలో ఏర్పాటైంది. అయితే.. నెహ్రూ జూపార్కులో మూషిక జింకల సంతతి పెరిగినా రాబందుల సంఖ్యలో వృద్ధి లేదు.

గత ఆరు సీజన్లలో మాత్రమే రాబందులు ఒకటి, రెండు గుడ్లు పెట్టాయి. పొదిగి పిల్లను చేయడంలో మాత్రం రాబందులు సఫలం కాలేదు. మగ, ఆడ పక్షుల మధ్య వయసులో వ్యత్యాసం ఉండడం, ఇక్కడి వాతావరణానికి అలవాటుపడక పోవడం, ఇతర కారణాలతో సంతతి పెరగడం లేదు.



# సర్వజన అవస్థలు

ఖమ్మం : ఖమ్మం జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతో సర్వజనాసుపత్రిగా రూపాంతరం చెందింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. పలు విభాగాల్లో అవార్డులు, రివార్డులూ అందుకుంది. నేడు సదుపాయాలు కొరవడి సతమతమవుతోంది. నిపుణుల కొరత, పని చేయని పరికరాలు, ఆర్థిక ఇబ్బందులతో కునారిల్లుతోంది. పేదలు వైద్యమందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

పడకేసిన పరికరాలు

ఇటీవల సీటీ స్కానింగ్ యంత్రానికి విద్యుత్తు సరఫరా చేసే వైరు కాలిపోయి సేవలు నిలిపివేశారు. కొత్త తీగకు రూ.3.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా. నిధుల లేక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎక్స్‌రే విభాగంలో కంప్యూటెడ్ రేడియోగ్రఫీ(సీఆర్) పరికరం పని చేయడం లేదు. ఇది ఎక్స్‌రే చిత్రాలను నాణ్యమైన డిజిటల్ ఫార్మాట్‌లోకి మారుస్తుంది. సాంకేతిక సమస్యలతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. ప్రతిరోజు 200లకు పైగా ఎక్స్‌రేలు తీస్తారు. నిపుణుడు అందుబాటులో లేకపోవడంతో మరమ్మతులు చేయడంలో జాప్యం. ప్రత్యామ్నాయంగా పరికరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆన్‌లైన్ సేవలు ఆలస్యం..

ఆస్పత్రిలో ఓపీ నమోదు నుంచి వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికల జారీ వరకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు, సర్వర్లు మొరాయించడం, ప్రింటర్లు పని చేయకపోవడం, సిబ్బంది కొరత కారణంగా ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఓపీ నమోదు చీటీల కోసం గంటల తరబడి బారులుదీరాల్సిన పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులు వేచి ఉండలేక నీరసించిపోతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికలు సకాలంలో అందడం లేదు. నిర్దిష్ట సమయంలో నివేదికలు అందక వైద్య నిర్ణయాలు తీసుకోవడం



ఆలస్యమవుతోంది.

ఉష్ణోగ్రత నియంత్రణ అస్తవ్యస్తం

ఐసీయూ(ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఏసీలు పని చేయడం లేదు. ప్రాణాపాయ స్థితిలో రోగులకు ఇక్కడ చికిత్సలు అందిస్తారు. రోగుల ఆరోగ్యం నిలకడగా ఉండేందుకు శీతల వాతావరణం అవసరం. ఏసీలు మరమ్మతులకు గురి కావడంతో రోగుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతలు శరీర వేడిని పెంచడంతో ఆక్సిజన్ స్థాయిలు తగ్గుతాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు వేగంగా వ్యాపిస్తాయి. ఇన్‌ఫెక్షన్ల తీవ్రత పెరిగే ప్రమాదం ఉంది. రోగులు, సిబ్బంది దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.

రేడియాలజిస్టుల కొరత..

పలు విభాగాల్లో పరికరాలున్నా రేడియాలజిస్టులు లేక పరీక్షలు చేయడం లేదు. గర్భధారణ శిశువు ఎదుగుదల నిర్ధారణకు 18, 23 వారాల్లో టిఫా పరీక్షలు చేయాలి. రెండు పరికరాలున్నా నిపుణులు లేరు. పలుమార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఎవరూ రావడం లేదు. ప్రభుత్వం రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయడం లేదు.

ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా పరికరాల మరమ్మతులకు టెక్నీషియన్లు బయట నుంచి రావాల్సి ఉందని.. ఆర్థిక అవసరాలు, నిపుణుల నియామకం అంశాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. అత్యవసర రోగులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

# జనవరి కల్లా.. జలకాలాట!

ఇల్లెందు : ఇల్లెందు పట్టణ వాసులకు వచ్చే జనవరి కల్లా కొత్తగా ఈత కొలను అందుబాటులోకి రానుంది. చాలామంది చిన్నారులు పట్టణ సమీపంలోని వాగులు, చెరువుల్లో ఈత సాధనకు వెళ్లి ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. మరోవైపు పట్టణంలో అధునాతన క్రీడా సదుపాయాలు అందని ద్రాక్షగా మారాయి. ప్రస్తుతం సింగరేణి ఆధ్వర్యంలో వైసీవో క్లబ్‌లో మాత్రమే ఈతకొలను అందుబాటులో ఉంది. ఇక్కడకు కేవలం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులను మాత్రమే అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో పురపాలక సంఘం చొరవచూపి పట్టణ ప్రజల కోసం ఈత కొలను నిర్మిస్తోంది.

ఎక్కడ?ఇల్లెందు చెరువుకట్ట వద్దనున్న పార్కులో జిల్లా మినరల్ ఫండ్(టీ) నిధులు రూ.కోటితో స్విమ్మింగ్ పూల్ నిర్మించాలని పురపాలకం నిర్ణయించింది. ఈ పనులకు గత నెలలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే సివిల్ పనులను చేపట్టారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ వారికి నిర్మాణ బాధ్యత అప్పగించారు. కొలను, రహదారి, స్త్రీ, పురుషులకు వేర్వేరు స్నానపు గదులు, మరుగుదొడ్లు, షవర్లు నిర్మించనున్నారు.

'ఈత కొలనును 36 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నాం స్త్రీ, పురుషులు, చిన్నారులు వేర్వేరుగా వినియోగించేకునేలా ఏర్పాట్లు ఉంటాయి. వచ్చే ఏడాది జనవరికల్లా అందుబాటులోకి వచ్చేలా పనులు పర్యవేక్షిస్తున్నాం' అని పీఆర్ ఈఈ ఎస్.శ్రీనివాస్ చెప్పారు.'పట్టణ వాసుల ఈత సాధన, విహారం కోసం అధునాతన వసతులతో ఈత కొలను నిర్మిస్తున్నాం. ఈత నేర్చుకోవాలనే సరదా ఉన్న పెద్దలు, చిన్నారులు ఈ వసతిని సద్వినియోగం చేసుకునేలా పురపాలకం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తిచేయిస్తాం. పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నాం' అని ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

## 12 ఏళ్లుగా నిరుపయోగంగా..

కోరుట్ల : కోరుట్ల మండల కేంద్రంలో నిర్మించిన స్త్రీశక్తి భవనం ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(టీ–సెర్ప్) కోరుట్ల మండల కార్యాలయాన్ని ఆదర్శనగర్‌లో 2010లో చిన్న భవనంలో ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 986 మహిళా సంఘాలు, మొత్తం 10,160 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పాత భవనం సరిపోకపోవడంతో కార్యాలయ ఉద్యోగులు, మహిళలు చాలా ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2012లో అప్పటి ప్రభుత్వం మండలానికి ఒక అధునాతన స్త్రీ శక్తి భవనం నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.25 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో మండల పరిషత్ కార్యాలయం వెనకాలున్న ఖాళీ స్థలంలో నూతన భవన నిర్మాణం ప్రారంభించారు. నిధులు సరిపోకపోవడంతో 2016లో మరో రూ.7 లక్షలను కేటాయించారు. మొత్తం రూ.32 లక్షల నిధులు వెచ్చించి స్త్రీ శక్తి భవనం నిర్మించారు.

# ఒళ్లు హూనం.. గన్యానా.. డెంగీనా..?



హైదరాబాద్: చికున్ గన్యా బారినపడిన వారిలో కొత్త లక్షణాలు కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలోనూ ప్లేట్‌లెట్లు తగ్గిపోతుండటంతో తొలుత వైద్యులు డెంగీగా అనుమానంతో ఎన్ఎస్1, ఐజీజీ ఎలీసా పరీక్షలు చేస్తున్నారు. డెంగీ లేదని తేలాక చికున్‌గన్యాకు చికిత్స అందిస్తున్నారు. చిన్నపిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా కనబడుతోంది.

నిలోఫర్ ఆసుపత్రిలో ఓపీకి నిత్యం 5-6 వరకు ఈ తరహా కేసులు వస్తున్నాయి. పిల్లల్లోనూ కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటున్నాయి.

చికున్‌గన్యా సోకిన వారిలో కొత్తగా ముక్కు భాగంలో నల్లని ప్యాచ్‌లు వస్తున్నాయని వైద్యులు తెలిపారు. దీన్ని నిర్ధారించడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీసీఆర్ టెస్టులు అందుబాటులో లేవు. లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందిస్తున్నారు.

నగరంలో డెంగీ కంటే చికున్‌గన్యా కేసులు అధికంగా నమోదవుతున్నాయని వైద్యులు పేర్కొన్నారు. జ్వరం తగ్గినా.. చాలామందిలో 3-4 వారాలపాటు తీవ్ర కీళ్ల నొప్పులు ఉంటున్నాయి. ఇందుకు టైగర్‌దోమే కారణం.

డెంగీ, చికున్‌గన్యా వైరల్‌కు సంబంధించినవే. నొప్పులు తగ్గడానికి కొందరు పెయిన్‌కిల్లర్లు వాడుతున్నారు. వైద్యుల సూచనలు లేకుండా వాడొద్దని సూచిస్తున్నారు.

తీవ్రమైన జ్వరం వల్ల శరీరం త్వరగా డీహైడ్రేషన్ బారిన పడుతుంది. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల నిస్సత్తువ ఆవహించదు.

చికున్‌గన్యా లక్షణాలు...
హఠాత్తుగా 102 డిగ్రీలకుపైగా జ్వరం
తీవ్ర కీళ్ల, కండరాల నొప్పులు
నొప్పులతో కదలలేని పరిస్థితి
చేతుల మణికట్టు, కాళ్లు, మడమలు, భుజాల్లో నొప్పి
చర్మంపై దద్దుర్లు, ముఖంపై నల్లటి ప్యాచ్‌లు
జ్వరం తగ్గినా.. నెల రోజులపాటు కీళ్ల నొప్పులు
కొందరిలో ప్లేట్‌లెట్లు తగ్గిపోవడం.

డెంగీ ఇలా..
ఆకస్మిక అధిక జ్వరం(102 డిగ్రీలకుపైగా)
తీవ్ర తల, కళ్ల వెనుక నొప్పి
తీవ్రమైన కండరాల నొప్పి
అలసట, వికారం, వాంతులు, అతిసారం
జ్వరం ప్రారంభమైన రెండు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు ః
తేలికపాటి రక్తస్రావం
ప్లాస్మా లీకేజీలు
కాళ్లు, కళ్ల కింద వాపులు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు
ఇంట్లో దోమలు లేకుండా చూసుకోవాలి. దోమ తెరలు వాడాలి.
కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. చెత్తాచెదారం తొలగించాలి.
పిల్లలను స్కూళ్లకు పంపేటప్పుడు చేతులు, కాళ్లు కప్పి ఉంచేలా సాక్సులు, ఇతర వస్త్రాలు ధరింపజేయాలి.
ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలి.

వైద్యులను సంప్రదించాలి
ప్రస్తుతం నగరంలో చికున్‌గన్యా ఎక్కువగా కనిపిస్తోంది. పిల్లలు కూడా ఈ జ్వరం బారిన పడుతున్నారు. 102 డిగ్రీలపైన జ్వరముంటే.. వైద్యులను సంప్రదించాలి. కొన్నిసార్లు చికున్‌గన్యాలో ప్లేట్‌లెట్ల తగ్గుదల ఉంటుంది. అంత ముప్పు కాదు. కానీ డెంగీలో ప్లేట్‌లెట్లు తగ్గడం, ప్లాస్మా లీకేజీలతో రోగి పరిస్థితి విషమంగా మారే ప్రమాదం ఉంటుంది. పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.
డాక్టర్ ఉషారాణి, చిన్న పిల్లల వైద్యనిపుణులు, నిలోఫర్ ఆసుపత్రి

# రహదారులపై వరి కుప్పలు ప్రమాదాలకు నిలయాలు

సిరిసిల్ల : పంట ఉత్పత్తులు ఆరబెట్టేందుకు కల్లాలు, కొనుగోలు కేంద్రాలు లేక ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. గత్యంతరం లేక రహదారులపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. సిరిసిల్ల పురపాలిక పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక విక్రయాలు పూర్తయ్యేవరకు రహదారిపైన ఆరబెడుతూ అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లోనూ వరికోతలు ఊపందుకున్నాయి. సిరిసిల్ల పురపాలికలో రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్‌లో విస్తారంగా వరిసాగైంది. ఇక్కడ మెప్మా, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తారు. కోతలు ప్రారంభమవడంతో రైతులు సిరిసిల్ల-కామారెడ్డి రెండో బాహ్యవలయ రహదారిపై ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఇక్కడ ప్రతి సీజన్‌లో ఈ కేంద్రాల్లో 54 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు విక్రయిస్తారు.

వరి కోతలు పూర్తయ్యాక రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి బాహ్యవలయ రహదారిపైకి తీసుకొస్తున్నారు. ధాన్యం ఆరబోతకు కల్లాలు లేకపోవడంతో రహదారినే కొనుగోలు కేంద్రాలుగా వాడుతున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికీ ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక.. ధాన్యం ఆరబోత ఇబ్బందులతో ఆయా గ్రామాల్లో చాలా మంది రైతులు ఇప్పటికే రైస్‌మిల్లులకు



విక్రయిస్తున్నారు. క్వింటా సాధారణ రకం ధాన్యానికి రూ.2,300, ఏ గ్రేడు రకానికి రూ.2,320 మద్దతు ధర ఉంది. సన్నధాన్యానికి రూ.500 బోనస్ కలుపుకొని రూ.2,820 ధర లభిస్తుంది. కానీ రైతులు క్వింటా రూ.1900లకు విక్రయించి నష్టపోతున్నారు.

సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్దాపూర్‌లో ఉంది. ఇక్కడ ఇరవై వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు ఉన్నాయి. పంట ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేకంగా షెడ్లు కూడా ఉన్నాయి. పెద్దూరు, సర్దాపూర్ గ్రామాలకు మాత్రమే దగ్గరగా ఉంటుంది. మిగతా గ్రామాలకు చాలా దూరంగా ఉంటుంది. రైతులు పంట ఉత్పత్తుల రవాణా భారంతో ఇక్కడికి తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది.

కేంద్రాలకు స్థలాలు లేక...చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లిలో మెప్మా, పెద్దూరు, సర్దాపూర్‌లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తారు. వీటిలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ, సొంత స్థలాలు లేవు. ఏటా రెండు సీజన్లలో నాలుగు నెలలు సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారిపైనే విక్రయాలు జరగాలి. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ స్థలం చూపించాలని ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాలు, రైతులు అధికారులను పలుమార్లు కోరారు. వీరి వినతులు బుట్టదాఖలయ్యాయి.

ఇవీ సంఘటనలుసిరిసిల్ల పట్టణానికి చెందిన రాజశేఖర్ (27) ఈ నెల 13న ద్విచక్రవాహనంపై సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారి నుంచి సిరిసిల్లకు వస్తున్నాడు. చిన్నబోనాల సమీపంలో ధాన్యం కుప్పను ఢీకొట్టిన వాహనం అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17న మృతి చెందాడు.గతేడాది వానాకాలం ధాన్యం కొనుగోలు సీజన్‌లో పెద్దూరు రెండు పడక గదుల ఇళ్ల సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు వరికుప్పను ఢీకొని కింద పడటంతో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు.

2022 యాసంగి సీజన్‌లో ఒడిశా వలస కార్మికుడు ద్విచక్రవాహనంపై వస్తూ రగుడు వద్ద వరికుప్పను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

స్థలం చూపించాలని అడిగాం
కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ స్థలం చూపించాలని ఇది వరకు రెవెన్యూ అధికారులను కోరాం. ప్రభుత్వ స్థలం చూపిస్తే అక్కడే కొనుగోలు కేంద్రాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.
మీర్జా ఫసహత్ ఆలీ బేగ్, మెప్మా పీడీ

# మద్యం సీసా చూపిన సాక్ష్యం

హైదరాబాద్: పగిలిన మద్యం సీసా ఓ హంతకుడిని పట్టించింది. దాదాపు 20నెలలుగా పెండింగ్‌లో ఉన్న మహిళ హత్య కేసును ఛేదించింది. ఇదీ నేపథ్యం.. : ఏపీలోని నెల్లూరు జిల్లా ఓజిలి మండలానికి చెందిన చెంచు శైలజారెడ్డి(42) భర్త కృష్ణారెడ్డి, ఇద్దరు పిల్లలతో కలిసి 2011లో కందుకూరుకు వచ్చి.. దాసర్లపల్లిలోని అరుణ ఫాం హౌస్‌లో పనికి కుదిరారు. 2023 మార్చి 3న కృష్ణారెడ్డి, పిల్లలు బయటకు వెళ్లగా శైలజారెడ్డి ఒక్కరే ఉన్నారు. అప్పటికే ఆమెపై కన్నేసిన దాసర్లపల్లికే చెందిన ఉప్పుల శివకుమార్.. ఫాంహౌస్‌కు వెళ్లి ఆమెను బలవంతం చేయబోగా ఎదురు తిరిగింది. దీంతో కత్తితో ఆ మహిళను నరికి చంపాడు. తర్వాత పక్కనే మద్యం సీసా కనిపించగా తాగేందుకు



ప్రయత్నించాడు. సీసా చేజారి కింద పడి పగిలిపోయింది. దానిపై నిందితుడి వేలిముద్రలు పడ్డాయి. అనంతరం పరారయ్యాడు. వేలిముద్రలు మినహా ఘటనాస్థలిలో ఎలాంటి ఆధారాలు లభ్యమవ్వలేదు. ఎప్పటికైనా నిందితుడు చిక్కుతాడనే ఉద్దేశంతో పోలీసులు మద్యం సీసా మీద వేలిముద్రలు భద్రపరిచారు. తాజాగా కొత్తగూడ మామిడి తోటలో వృద్ధ దంపతుల హత్య కేసులో శివకుమార్ నిందితుడని పోలీసులు సాంకేతిక ఆధారాలతో గుర్తించి అరెస్టు చేశారు. ఇక్కడ సేకరించిన వేలిముద్రల్ని.. శైలజారెడ్డి హత్య కేసులో నమోదైన వాటిని రెండింటినీ రాచకొండ ఫింగర్ ప్రింట్ యూనిట్‌తో పోల్చగా సరిపోలాయి. పోలీసులు రెండు కేసుల్లోనూ నిందితుడిగా చేర్చారు.

# పార్కింగ్ కష్టాలు తీరేలా.. నాంపల్లిలో 10 అంతస్తుల భవనం పూర్తిగా వాహనాలకే..




హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నగరంలోనే మొదటిసారిగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం(ఎంఎల్‌పీ) జనవరి 1 నుంచి జరిగే నుమాయిష్ నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పనుల పూర్తికి మరో రెండు నెలలు పడుతుందని నిర్మాణదారులు చెబుతున్నారు. నాంపల్లి కూడలిలో మెట్రోకి చెందిన అర ఎకరం స్థలంలో బహుళ సముదాయ నిర్మాణ పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మెస్సర్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ పీపీపీ విధానంలో రూ.80 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తోంది. మెట్రో భూమి కేటాయించగా.. ప్రైవేటు సంస్థ నిధులు వెచ్చించి నిర్మాణం చేపడుతోంది. 50 ఏళ్ల లీజ్ ఒప్పందమిది. కొవిడ్ తీవ్రత, రుణ లభ్యత సమస్యలు, గ్లోబల్ సప్లయ్ చైన్ అవాంతరాల వంటి కారణంగా ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్ర జాప్యమైంది. దాదాపు ఐదేళ్లు కావొస్తుంది. అందుబాటులోకి వస్తే నాంపల్లి చుట్టుపక్కల పార్కింగ్ తిప్పలు తీరుతాయని వాహనదారులు ఎదురుచూస్తున్నారు.

మూడు నిమిషాల్లోనే చేసేలా.. కింది అంతస్తులో వాహనాలు నిలిపేందుకు నాలుగు టెర్మినళ్లు ఏర్పాటు చేశారు. వాహనాన్ని నిలిపేందుకు టర్న్ టేబుల్‌పై వాహనం సరి. ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి వెళ్లి పార్కింగ్ చేస్తుంది.

ఆ తర్వాత ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తుకు తీసుకెళ్లి ఖాళీగా ఉన్న స్థలంలో పార్క్ చేస్తుంది. జర్మన్ సాంకేతికత ఇది.పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి చెల్లించిన పార్కింగ్ టికెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపగానే ట్రాన్స్‌ఫోర్టర్ షటిల్ ఆటోమెటిక్‌గా కారును వాహనదారుడికి అందజేస్తుంది. పార్కింగ్‌కోసం నిమిషం కంటే తక్కువ, తిరిగి పొందడానికి రెండు నిమిషాలు మాత్రమే పడుతుంది. రెండు సినిమా తెరలు కూడా... సముదాయంలో పై అంతస్తుల్లో రెండు సినిమా తెరలను సిద్ధం చేశారు. ఆహారశాలలు ఉంటాయి. ఇతర వాణిజ్య కార్యకలాపాలను లీజ్ పద్ధతిలో ఇస్తారు. వీటితో వచ్చే ఆదాయంతో సముదాయం నిర్వహణ, పెట్టుబడి ఖర్చును రాబట్టుకుంటారు.

# మత్తెక్కించే డ్రగ్స్.. మైమరిపించే మగువలు

హైదరాబాద్ : గచ్చిబౌలి పబ్‌లో డ్రగ్స్ తీసుకొని దొరికిన ప్రబుద్ధులు. మాదాపూర్ పబ్‌లో నవ్వుతూ పలకరించి జేబులు గుల్లచేసే అందమైన అమ్మాయిలు. బంజారాహిల్స్ బార్‌లో విదేశీ యువతుల నగ్న.. అర్ధనగ్న నృత్యాలు. నగరంలోని పలు పబ్‌లు, బార్‌లు వినోదం ముసుగులో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. కుర్రకారును ఆకట్టుకునేందుకు దేశ, విదేశాల నుంచి అందమైన మగువలను రప్పిస్తున్నాయి.. తమను తాము మరచిపోయే సింథటిక్ డ్రగ్స్‌ను రుచిచూపుతున్నాయి. పలుమార్లు టీజీన్యాబ్, పోలీసులు, ఆబ్కారీ యంత్రాంగం తరచూ దాడులు చేసి కేసులు నమోదుచేస్తున్నా.. నిర్వాహకులు తీరుమార్చుకోవట్లేదు. కాసులు ఎదజల్లి మళ్లీ అనుమతులు తెచ్చుకుంటున్నారు. వలపు వల.. జేబుగుల్ల: మాదాపూర్, బంజారాహిల్స్.. గచ్చిబౌలి ఇలా ఖరీదైన ప్రాంతంలో పబ్‌కు ఒంటరిగా వెళ్లారా.. కాస్త 'రిలాక్స్' అవ్వాలనే సమయంలో పక్కనే కూర్చున్న అందమైన యువతి పలకరింపు వినిపిస్తుంది. చిరునవ్వుతో ఆరా తీస్తుంది. తన మిత్రుడు వస్తానని చెప్పి ఎక్కడో చిక్కాడంటూ నమ్మిస్తుంది. మాటలతో మాయచేసి సరదా సంభాషణ నుంచి వలపు వాకిట్లోకి తీసుకెళ్తుంది. ఛీర్స్.. డ్యాన్స్.. అపై రొమాన్స్ అంటూ ఊరించి.. తేరుకునేలోపు మాయమవుతుంది. పబ్ నిర్వాహకులు వేలల్లో బిల్లు చేతిలో పెట్టి అతని ముక్కు పిండి మరీ వసూలు చేస్తారు.. గత కొద్ది రోజులుగా నగరంలో కొనసాగుతున్న దందాపై పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా కొందరు యజమానులు తమ తీరు మార్చుకోవడం లేదు.. గోవా, ముంబయి తరహాలో నగరంలోని పలు పబ్‌లు ఇతర రాష్ట్రాల యువతులు, మహిళలకు ఉచిత ప్రవేశం కల్పించి.. కమీషన్ ఆశచూపి ఒంటరిపక్షులను యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

లెస్పాబ్ పబ్‌లో ఇదే తరహాలో నిర్వాహకులే అమ్మాయిలను తీసుకొచ్చి కస్టమర్లతో అధికంగా మద్యం తాగి బిల్లు పెరిగేలా దందా చేశారు. బంజారాహిల్స్‌లోనూ ఒక పబ్‌లో అమ్మాయిలను తీసుకొచ్చి దందా చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తాజాగా టాస్ పబ్ వ్యవహారంలోనూ ఇదే చోటుచేసుకొంది. దాదాపు 42 మందిలో 22మంది యువతులు, 20 మంది వివాహితులు



శనివారం రాత్రి నిర్వహించిన పోలీసుల దాడుల్లో దొరికారు. వీరిలో చాలామంది గృహిణులున్నారు.

ఆర్థిక అవసరాలకు పబ్‌కు వెళ్లి కాసింత సమయం అక్కడున్న వారిని తమ నృత్యాలతో రంజింపచేస్తున్నారు. వారితో కలిసి మద్యం సేవించి బిల్లును రెట్టింపు చేసి కమీషన్ తీసుకుంటున్నామంటూ పోలీసుల ఎదుట వాపోయారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా..
గోవా, ముంబయి, దిల్లీ, పుణె, బెంగళూరు వంటి నగరాల్లో కొన్ని పబ్బులు, బార్లలో యువతులు ప్రత్యేకంగా నృత్యాలు చేయడానికి వస్తుంటారు. రూ.2-3వేలు ఇచ్చే ఒప్పందంతో రప్పిస్తున్నారు. కొన్ని పబ్‌లు ముజ్రాపార్టీకి ముంబయినుంచి హిజ్రాలను రప్పిస్తున్నారు. విదేశీ యువతుల నృత్యాన్ని ఆస్వాదించేందుకు ప్రత్యేక రుసుం వసూలు చేస్తున్నారు.

నవ్వుకు చిక్కి కేసుల్లో ఇరుక్కోవద్దు:
పబ్‌కు వెళ్లే సమయంలో అక్కడి పరిస్థితులను ముందుగా తెలుసుకొని వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. పరిచయం లేని యువతులు, మహిళలు వచ్చి మాట, మందు కలిపితే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలంటున్నారు. గతంలో రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో మాదకద్రవ్యాల పేరుతో పోలీసులు దాడి చేసి దాదాపు 200 మందిని బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. బంజారాహిల్స్‌లోని ఆఫ్టర్ 9 పబ్‌లోనూ ఇదే తరహాలో 175 మందిని, టాస్ పబ్‌లో 142 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.చీకటి కార్యకలాపాలకు పాల్పడే పబ్‌లు, బార్‌లను సీజ్ చేయమని నగర సీపీ సీవీ ఆనంద్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది.

# గూగుల్‌లో వేట.. నేరగాళ్ల ఆట

హైదరాబాద్: ఎలక్ట్రానిక్ వస్తువు చెడిపోయిందని కంపెనీ కస్టమర్ కేర్ కోసం గూగుల్‌లో వెతకగానే ఓ నంబరు ప్రత్యక్షమవుతుంది.. ఫోన్ చేశాక అవతలి వ్యక్తులు చెప్పినట్లు చేశామా ఖాతా ఖాళీ.. బ్యాంకు లావాదేవీపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేద్దామని ప్రయత్నిస్తే నకిలీ వెబ్‌సైట్ దర్శనమిస్తుంది. తనిఖీ చేసుకోకుండా వివరాలు నమోదుచేస్తే ఖాతా గుల్లయినట్టే.. సైబర్ నేరస్థులు కేవలం పౌరులనే కాదు గూగుల్‌ని ఏమార్చి రూ.వందల కోట్లు కొల్లగొట్టేస్తున్నారు.

ఇదీ నేరగాళ్ల మంత్రం..గూగుల్, ఇతర సెర్చ్‌ంజన్ ఏదైనా వెబ్‌సైట్, సమాచారం కోసం వెతికినప్పుడు ఎక్కువ మంది వీక్షించే వెబ్‌సైట్లు, సంబంధించిన ప్రకటనలు తెరపై ప్రత్యక్షమవుతాయి. సైబర్ ముఠాలు దీన్ని వాళ్లకు అనుకులంగా మార్చుకుంటున్నాయి. అసలైన వెబ్‌సైట్లకు బదులు తాము సృష్టించిన నకిలీ వెబ్‌సైట్ ప్రముఖంగా కనిపించేలా చేస్తున్నారు. సంస్థ పేరులో ఏదో ఒక అక్షరం తేడాతో ఈ వెబ్‌సైట్ ఉంటుంది. గూగుల్ అల్గారిథమ్ ప్రకారం.. అసలు వెబ్‌సైట్ కోసం వెతికినప్పుడు ఎక్కువ వీక్షణలుండే నకిలీ వెబ్‌సైట్ ముందు ప్రత్యక్షమవుతుంది. ఎక్కువ మంది అసలు, నకిలీ వెబ్‌సైట్లకు తేడా గుర్తించకుండా అందులోని నకిలీ కస్టమర్ కేర్ నంబర్లకు ఫోన్ చేస్తుంటారు. కొందరు వెబ్‌సైట్లకు వెళ్లకుండా నేరుగా ఆయా కంపెనీల కస్టమర్ కేర్ నంబరు కోసం వెతుకుతారు. ఇలా వెతికినప్పుడు తెరపై 90




శాతం నకిలీ కాల్‌సెంటర్ల నంబర్లు వస్తుంటాయి. ఈ కాల్స్‌ను స్వీకరించే నేరగాళ్లు నమ్మకంగా మాట్లాడుతూ వివరాలు సేకరించి డబ్బు కొట్టేస్తున్నారు.

10 శాతం మోసాలివే..ప్రస్తుతం 185 రకాల సైబర్ మోసాలు జరుగుతున్నాయి. ఇందులో క్రెడిట్, డెబిట్ కార్డు, కస్టమర్ కేర్, తక్కువ ధరకే విలువైన వస్తువులు తదితర మోసాలు దాదాపు 10 శాతం వరకూ ఉంటున్నాయి. వెబ్‌సైట్లో అంతా సవ్యంగానే కనిపించినా వివరాలు నమోదు చేయించి వేర్వేరు ఫీజుల పేరుతో డబ్బు వసూలు చేస్తారు. తక్కువ ధరకే వస్తువులంటూ ప్రకటనలో బోల్తా కొట్టించడం మరో మోసం. మనం ఫర్నీచర్ కోసం వెతికినప్పుడు తెరపై రూ.2 వేలకే మంచి ఖరీదైన ఫర్నీచర్, రూ.10 వేలకే ఫ్రిజ్ వంటి ప్రకటనలు వస్తాయి. పొరపాటున వీటి మీద క్లిక్ చేస్తే నేరుగా నకిలీ వెబ్‌సైట్లోకి తీసుకెళ్తుంది. వస్తువు డెలివరీ చేయడానికి డబ్బు కట్టాలంటూ మోసగిస్తారు. నకిలీ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినప్పుడు ముందస్తు డిపాజిట్ కట్టాలనో.. లేక లింకు పంపిస్తే దాన్ని క్లిక్ చేయాలని చెబుతారు. ఈ లింకు క్లిక్ చేస్తే ఎనీ డెస్క్ వంటి యాప్‌లు డౌన్‌లోడ్ అయి ఫోన్ మొత్తం నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంది.

# అలంకారప్రాయంగా బస్తీ దవాఖానా

వేములవాడ : పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా అలంకారప్రాయంగా మారింది. వేములవాడలోని రాజన్న దర్శనానికి వచ్చే భక్తులతోపాటు జాత్రగౌండ్ ప్రాంతంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏడాదిన్నర క్రితం ఆలయ లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో దీనిని ఏర్పాటు చేశారు. అన్ని వసతులు కల్పించి రెండు పడకలతో ప్రారంభించారు. ఇందులో ఒక వైద్యుడు, స్టాఫ్‌నర్స్, హెల్పర్‌ను నియమించారు. ఆసుపత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి నామమాత్రంగానే రోగులు వస్తున్నారు. స్థానికులు మాత్రం రక్తపోటు, మధుమేహం, దగ్గు వంటి వాటికి మందుల కోసం వస్తున్నారు.

అరకొరగా మందులు
ఆసుపత్రికి వచ్చే రోగులే తక్కువగా ఉంటే మందులు కూడా అరకొరగానే సరఫరా అవుతున్నాయి.

ఏడాదికి లక్ష రూపాయల బడ్జెట్ పెట్టినప్పటికీ నిధులు విడుదల కావడం లేదు.మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ఒక వేళ వచ్చినా పూర్తి స్థాయిలో రావడం లేదు.

ఆరు నెలల నుంచి అరకొరగానే మందులు వస్తున్నట్లు చెబుతున్నారు.ఆసుపత్రి ముందు భక్తులు, ఇతరులు వాహనాలు నిలుపుతున్నారు. దీనికి ఇరువైపులా రహదారులను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు.



వారంలో ఈ రోజుల్లేనా...వారంలో శనివారం ఆసుపత్రికి సెలవు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. మిగతా రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంటుంది.రాజన్న ఆలయానికి రాత్రింబవళ్లు భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం వేములవాడకు వచ్చినవారు ఇక్కడ వసతి గదుల్లో బస చేసి సోమవారం స్వామివారిని దర్శించుకుంటారు. రాత్రి వేళ ఏదైనా వైద్య సహాయం అవసరమైతే భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 24 గంటలూ వైద్య సేవలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని వైద్య సేవలను మరింత విస్తృత పరచాల్సిన అవసరం ఉంది.

ఉన్న మందులనే ఇస్తున్నాం
ఆసుపత్రికి పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు. అరకొరగా సరఫరా అవుతున్నాయి. సిబ్బంది కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. సోమ, శుక్రవారాల్లో దాదాపు 20 మంది వస్తున్నారు.రవీందర్, వైద్యుడు బస్తీ దవాఖానా, వేములవాడ




## శారదాపీఠం భూ కేటాయింపులు రద్దు.. ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే.. 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది.

ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ ఛార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సీఎం చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు, సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**విశాఖ శారదాపీఠానికి భూ కేటాయింపు రద్దు..** విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున అడ్డగోలుగా ఇచ్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించింది. శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేయాలని నిర్ణయించింది

## వైసీపీకి బిగ్ షాక్.. కీలక నేత రాజీనామా




వైసీపీకి నేతల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. తాజాగా మరో సీనియర్ మహిళా నేత, మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ వైసీపీని వీడారు. ఈరోజు ఆమె అధికారికంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఎన్నికలకు ముందునుంచి పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆమె ఈ ఏడాది మార్చిలో మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి వైసీపీలో ఉన్నప్పటికీ యాక్టివ్‌గా కనిపించడంలేదు. ఎన్నికల ఫలితాల తర్వాత పెద్దగా ఆమె వాయిస్ వినిపించడంలేదు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలోనూ, అంతకుముందు వైసీపీ తరఫున తన గొంతును వినిపించిన వాసిరెడ్డి పద్మ కొంతకాలంగా సైలెంట్ అయిపోయారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో సరిపెట్టారని, పార్టీలో తనకు ప్రాధాన్యత దక్కడంలేదంటూ కొద్దిరోజులుగా వాసిరెడ్డి పద్మ అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఒక్కొక్కరిగా సీనియర్ నాయకులంతా వైసీపీని వీడుతున్న క్రమంలో తాజాగా వాసిరెడ్డి పద్మ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆమె రాజకీయాలకు దూరంగా ఉంటారా.. లేదంటే వేరే ఏదైనా పార్టీలో చేరతారా అనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. రాజీనామా లేఖను ఆమె మీడియాకు విడుదల చేశారు. రాజీనామా తర్వాత జగన్ వైఖరిపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**గుడ్ బుక్ కాదు..** కార్యకర్తల కోసం ఉండాల్సింది గుడ్ బుక్ కాదని.. గుండె బుక్ అంటూ వాసిరెడ్డి పద్మ రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ప్రమోషన్స్ కోసం పదాలు వాడటానికి రాజకీయ పార్టీ కంపెనీ కాదని వాసిరెడ్డి పద్మ తెలిపారు. పార్టీని నడిపించడంలో జగన్‌కు బాధ్యతలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు పరిపాలన చేయడంలోనూ బాధ్యత లేకుండా వ్యవహరించారని ఆమె ఆరోపించారు. అప్రజాస్వామిక పద్ధతులు, నియంతృత్వ ధోరణితో వ్యవహరించే నాయకుడిని ప్రజలు మెచ్చుకోరనే విషయాన్ని ఇటీవల ఏపీలో జరిగిన ఎన్నికలు స్పష్టం చేశాయన్నారు. ఎన్నికలకు ముందు.. సార్వత్రిక ఎన్నికలకు ముందు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. ఎన్నికల్లో టికెట్ ఆశించి దక్కకపోడంతోనే ఆమె రాజీనామా చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు లేదా తన భర్తకు టికెట్ కేటాయించాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను వాసిరెడ్డి పద్మ కోరారు. పార్టీ అధిష్టానం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో మనస్థాపంతో ఆమె పదవి నుంచి తప్పుకున్నారనే చర్చ జరిగింది. పదవికి రాజీనామా చేసినప్పటికీ సాధారణ కార్యకర్తగా కొనసాగుతానని ఆమె అప్పట్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏపీలో రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆమె వైసీపీని వీడారు.

## సహానా కుటుంబ సభ్యులకు వైయస్ జగన్ పరామర్శ



గుంటూరు: వైయస్‌ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ గుంటూరు జీజీహెచ్‌లో సహానా కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. వైయస్ జగన్ జీజీహెచ్‌కు వస్తున్న నేపథ్యంలో వైయస్‌ఆర్‌సీపీ అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వైయస్ జగన్ గుంటూరులో హెలికాప్టర్ దిగి ఆసుపత్రికి వెళ్తున్న మార్గంలో అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి రావడంతో ఆసుపత్రి వైయస్ జగన్ పరామర్శలకు కాస్త ఆలస్యమవుతోంది. అయినప్పటికీ వైయస్ జగన్.. అందరినీ పలకరిస్తూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాష్ట్రంలో మహిళల భద్రతలను కూటమి నేతలు ప్రశ్నార్థకంగా మార్చేశారని అన్నారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. అన్ని వర్గాల మహిళలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ప్రతీ బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నట్టు వైఎస్ జగన్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బాధితు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని హితవు పలికారు. అనంతరం ఆసుపత్రి వద్ద వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. వైయస్‌ఆర్‌సీపీ తరఫున బాధిత కుటుంబాలను ఆదుకుంటాం. ప్రతీ బాధిత ఆరు కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి ప్రతీ కుటుంబాన్ని ఆదుకోవాలి. రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు భద్రత లేదు. దీనిపై చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. ప్రతిపక్షంలో ఉన్న మేమే బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నాం. ప్రభుత్వంలో ఉన్న మీరు ఏం చేస్తారో.. ఎంత సాయం అందిస్తారో చూస్తాం. దళితులంతా నా వాళ్లే.. వారికి అండగా ఉంటాను. పేదల పక్షాన ఎంత దూరమైనా పోరాడతాను. వచ్చేది మన ప్రభుత్వమే. నిందితులను వెంటాడి జైల్లో పెడతాం. మన ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుంది అని హామీ ఇచ్చారు.




దిల్లీ: శీతాకాలం సమీపిస్తుంటే చాలు.. ఉత్తర భారతం మరీ ముఖ్యంగా దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యత దిగజారుతుంది. ఎప్పటిలాగే దీనిపై చర్చలు, విమర్శలు జరుగుతుంటాయి. తర్వాత దీని గురించి అంతా మర్చిపోతుంటారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో కేంద్రాన్ని ఉద్దేశించి సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. 'పంట వ్యర్థాలు తగలబెట్టడం' సమస్యపై కఠిన చట్టాలు రూపొందించకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. సవరణలతో పర్యావరణ చట్టాలను ఎలాంటి ప్రభావం చూపనివాటిగా మార్చారంటూ వ్యాఖ్యానించింది. అలాగే వ్యర్థాలను తగలబెట్టేవారిపై కఠిన చర్యలకు సంబంధించి కొత్త నిబంధనలను 10 రోజుల్లో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇటీవల గాలి కాలుష్యాన్ని అరికట్టడంలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ విఫలం కావడంపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. "పంట వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కనీసం ఒక్క కమిటీ కూడా వేయలేదు. ఏటా ఈ సమస్యను చూస్తుంటే సీఏక్యూఎం చట్టం అమలుకావడం లేదని తెలుస్తోంది. కమిటీలు ఏర్పాటుచేశారా? చట్ట ప్రకారం ఏం చర్యలు తీసుకున్నారో కనీసం ఒక్కటైనా చూపించండి. దిల్లీ ఎన్‌సీఆర్ రాష్ట్రాలకు గతంలో చెప్పినవన్నీ గాల్లో మాటలుగానే మిగిలినట్లు కనిపిస్తోంది" అని సీఏక్యూఎంను సుప్రీం ధర్మాసనం నిలదీసింది. కేవలం మీరు మౌన ప్రేక్షకులుగానే మిగిలిపోయారని మందలించింది.




## బంగ్లాదేశ్‌లో మళ్లీ నిరసనలు.. అధ్యక్షుడి భవనాన్ని ముట్టడించిన నిరసనకారులు

బంగ్లాదేశ్‌లో మళ్లీ నిరసనలు చెలరేగాయి. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి, దేశం వీడిన సంగతి తెలిసిందే. తాజాగా బంగ్లాదేశ్ అధ్యక్షుడి భవనాన్ని నిరసనకారులు ముట్టడించి ఆయన రాజీనామా చేయాలంటూ పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. మంగళవారం ఢాకాలోని సెంట్రల్ షాహీద్‌మినార్‌లో విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీ చేశారు. ఈసందర్భంగా నిరసనకారులు పలు డిమాండ్లను తెరపైకి తెచ్చారు. 'మాజీ ప్రధాని షేక్‌హసీనా ప్రభుత్వానికి సన్నిహితుడైన అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ రాజీనామా చేయాలి. 1972లో రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి.. కొత్త రాజ్యాంగాన్ని రూపొందించాలి. అవామీ లీగ్ పార్టీకి చెందిన బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్‌ను నిషేధించాలి. హసీనా ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికలను చట్టవిరుద్ధమని ప్రకటించాలి. దీంతోపాటు ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలి. జులై- ఆగస్టుల్లో జరిగిన నిరసనల స్ఫూర్తికి అనుగుణంగా గత ప్రభుత్వ ఛాయలు లేకుండా బంగ్లాదేశ్‌ను రిపబ్లిక్‌గా ప్రకటించాలి' అని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఆ నిరసనల్లో వందలమంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో అప్పటి ప్రధాని షేక్‌హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

ఆందోళనలు తీవ్రంగా ఉండటంతో ఆమె దేశం విడిచి, భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఆమె రాజీనామాతో బంగ్లాలో అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతోంది. వచ్చే ఏడాది అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని తాత్కాలిక ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది.





## గుంటూరు జీజీహెచ్‌లో వైకాపా కార్యకర్తల హల్‌చల్.. పోలీసుల తీరుపై విమర్శలు

అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ గుంటూరు జిల్లా పర్యటనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. రౌడీషీటర్ దాడిలో మృతిచెందిన తెనాలి యువతి కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ జీజీహెచ్‌కు వచ్చారు. వేలాది మంది రోగులు వచ్చే ఈ ఆస్పత్రి ప్రాంగణంలోకి ఆయన వెంట వందలాది మంది వైకాపా కార్యకర్తల్ని అనుమతించారు. జీజీహెచ్‌లో జగన్ ఉన్న గంటన్నర సేపు వారు ఆసుపత్రి పరిసరాల్లో గందరగోళం సృష్టించారు. జగన్ అనుకూల నినాదాలతో పాటు సీఎం చంద్రబాబును దూషిస్తూ అలజడి సృష్టించారు. వైకాపా మూకల అరాచకంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడ్డారు. జగన్ వచ్చి వెళ్లే వరకూ ఆసుపత్రి ప్రధాన గేటును మూసివేశారు. దీంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. వైకాపా కార్యకర్తలు ఆస్పత్రిలో అత్యవసర విభాగానికి వెళ్లే మార్గం వద్ద అడ్డుగా నిలుచున్నారు. అంబులెన్సులు కూడా రాలేని పరిస్థితి కల్పించారు. ఆస్పత్రి ప్రాంగణంలో గేట్లు దూకటంతో పాటు.. అక్కడి చెట్లు ఎక్కి నానా బీభత్సం సృష్టించారు. పరామర్శకు వచ్చే సమయంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో జగన్ రావడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కార్యకర్తలందరినీ పోలీసులు లోపలకు అనుమతించటంపైనా విమర్శలు వస్తున్నాయి. ముగ్గురు డీఎస్పీలు విధుల్లో ఉన్నా పరిస్థితిని అదుపు చేయలేకపోయారు. గతంలో బీటెక్ విద్యార్థి రమ్య హత్యకు గురైనప్పుడు నారా లోకేశ్ ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించకుండా పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టు చేసి పెదనందిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇప్పుడు మాత్రం జగన్‌కు రాచబాట పరిచారు.

మాజీ ముఖ్యమంత్రి హోదాలో జగన్ పర్యటనకు ఇబ్బందులు లేకుండా చూడటం వరకూ ఫర్వాలేదు. కానీ.. ఆస్పత్రిలో రోగులను ఇబ్బంది పెట్టేలా వైకాపా శ్రేణులు వ్యవహరిస్తున్నా వారిని కట్టడి చేయలేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

## నువ్వా శాంతిభద్రతల గురించి మాట్లాడేది... జగన్‌పై అనగాని ఫైర్



అమరావతి, అక్టోబర్ 23: ఎన్నికల్లో ఘరోపరాజయంతో పరాభవంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా వ్యవహరిస్తున్నారంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మాలనే ప్రయత్నంలో నోటి కొచ్చిందల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి పాలనలో మహిళలపై జరిగినన్ని దాడులు ఇంకెప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో 2 లక్షలకు పైగా కేసులు నమోదైతే.. వాటిని నిరోధించేందుకు అసలు చర్యలు తీసుకున్నారా అని నిలదీశారు. తన ఇంటి పక్కనే దళిత యువతిపై గ్యాంగ్ రేప్ జరిగితే నిందితుడు వెంకటరెడ్డిని ఐదేళ్ల పాటు అరెస్ట్ చేయకుండా చోద్యం చూసిన జగన్.. శాంతిభద్రతల గురించి మాట్లాడుతుంటే సిగ్గేస్తుందంటూ వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గంలోనే దళిత మహిళ నాగమ్మపై అత్యాచారం జరిగితే జగన్ రెడ్డి కనీసం పట్టించుకున్నారా అని మండిపడ్డారు. జగన్ రెడ్డి తన పాలనలో యువతను గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యానికి అలవాటు చేసి వారిని పెడదారి పట్టించారని విమర్శించారు. ఆ ప్రభావంతోనే సైకోలుగా మారిన మగాళ్లు మహిళలపై దాడులు కొనసాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నేరాలను ఉక్కుపాదంతో అణిచివేస్తోందని స్పష్టం చేశారు. మహిళలపై దాడులు జరిగిన ఘటనల్లో వెనువెంటనే పార్టీలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా నిందితులను అరెస్ట్ చేసి శిక్షిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

**జగన్ వ్యాఖ్యలు ఇవే...** ఏపీలో లా అండ్ ఆర్డర్‌పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో బ్రెయిన్ డెడ్ అయిన సహానా కుటుంబసభ్యులను జగన్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దిగజారిపోయిందన్నారు. ఒక దళిత చెల్లి బలై పోయిందని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలకు భరోసా ఇచ్చామని.. దిశ యాప్ అందుబాటులోకి తెచ్చామని చెప్పుకొచ్చారు. ఎస్‌ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులను పంపించే వాళ్ళమన్నారు. చేసిన వాడు మన వాడైతే ఏం చేసినా పర్వాలేదు అన్న సంకేతాలు పంపుతున్నారని విమర్శించారు. గుంటూరులో దయనీయమైన ఘటన జరిగిందని... ప్రభుత్వం ఏ విధంగా స్పందించిందో చూశామన్నారు. సీఎం చంద్రబాబుతో నిందితుడు దిగిన ఫోటోలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ధర్మం పాటించాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తర్వాత బాధితురాలిని ఆసుపత్రిలో చేర్చారని.. ప్రభుత్వం నుంచి ఎవరూ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేవలం టీడీపీకి చెందిన యువకుడు కావడంతోనే ప్రభుత్వం స్పందించ లేదని విమర్శించారు. రెడ్ బుక్ పాలనలో పోలీసులు నిమగ్నమయ్యారని వ్యాఖ్యలు చేశారు. అత్యాచారాలను అరికట్టలేకపోయారన్నారు. చంద్రబాబు పాలనలోకి వచ్చిన మూడు నెలల్లో 77 మందిపై అత్యాచారాలు జరిగాయని.. ఏడు మంది హత్యకు గురయ్యారని తెలిపారు. ప్రభుత్వం ఏమైనా పట్టించుకుంటుందా అంటూ మండిపడ్డారు. రెడ్ బుక్ పాలనలో ఏమైనా చేయండి వెనకేసుకొస్తామని చంద్రబాబు అంటున్నారన్నారు. ఫోక్సో కోర్టులు, మహిళా కోర్టులు ఏర్పాటు చేశామని.. దిశ వాహనాలను ఇచ్చామని వెల్లడించారు. పథకాలన్నీ ఎత్తి వేశారని.. మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. మహిళలు బ్రతకడానికి ఇబ్బంది పడే స్థితికి తీసుకొచ్చారని అన్నారు. తాము వచ్చిన తర్వాత ఏరి ఏరి నిందితులను పట్టుకుని జైలులో పెట్టిస్తామని స్పష్టం చేశారు. తప్పు జరిగిందని ఒప్పుకొని దర్యాప్తు చేయాలన్నారు. ప్రభుత్వం రాజకీయం చేస్తోందని జగన్ విమర్శించారు.

## పెట్రోల్ దాడి ఘటన.. విద్యార్థిని కుటుంబంతో మాట్లాడిన సీఎం చంద్రబాబు

బద్వేలు: వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆమె కుటుంబానికి సీఎం చంద్రబాబు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్, తెదేపా నేత శ్రీనివాసరెడ్డి చెక్కును అందజేశారు. పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన విద్యార్థిని తల్లితో సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. నిందితుడిని అరెస్టు చేశారని.. కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరుపుతామని చెప్పారు. బాలిక సోదరుడి చదువు బాధ్యత




ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఆమె తల్లికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# రియా బోల్డ్ డెనిమ్ లుక్ వైరల్


ఊహించనిది జరిగితే దానిని ఎదుర్కోవడమే ధైర్యవంతుని లక్షణం. అలాంటి ధైర్యం తనకు ఉందని నిరూపించింది రియా చక్రవర్తి. తూనీగ తూనీగ సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన రియా చక్రవర్తి బాలీవుడ్ యువహీరో సుశాంత్ సింగ్ తో ప్రేమాయణం సాగించడం, డ్రగ్స్ స్కామ్, మనీలాండరింగ్‌లో తన పేరు వినిపించడం, అనంతరం సుశాంత్ ఆత్మహత్య వగైరా సంచలనాలు అయ్యాయి. ఈ కేసులో రియా చక్రవర్తి అరెస్టయి జైలులో కొన్ని నెలలపాటు ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం బెయిల్ పై బయటే ఉన్న రియా తిరిగి తన జీవితాన్ని కొత్త కోణంలో చూపించేందుకు చేయని ప్రయత్నం లేదు. రియా చక్రవర్తి తన మాజీ ప్రియుడు, నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ జూన్ 2020లో మరణించిన తర్వాత తనపై వచ్చిన అభియోగాలు క్లియర్ కావడానికి ముందు కొంతకాలం జ్యుడీషియల్ రిమాండ్‌లో కూడా ఉంది. దీనిపై అప్పట్లో హ్యూమన్స్ ఆఫ్ బాంబేతో మాట్లాడిన రియా, వీటన్నింటికీ ముందు తాను భ్రమలతో కూడుకున్న ఆశావాదిని అని తెలిపింది. తాను ఎప్పుడూ తన పనిని ఆస్వాధించాలనుకుంటానని, ఎలాంటి లక్ష్యాలు లేకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటానని రియా చక్రవర్తి అన్నారు.



ఆరోపణల కారణంగా..దేశం మొత్తం నాపై ఎలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉంటుందో, మంచి లేదా చెడును మరచిపోతుందని నేను కచ్చితంగా ఊహించలేను! నటిగా కూడా నా ఆశయం ఎప్పుడూ నంబర్ 1 కాదు.. నేను ఒక క్రాఫ్ట్‌గా నటనను ఆస్వాధించడం ప్రారంభించాను. దాని గురించి లక్ష్యాలు లేవు. జగరబోయేదానికి ఎవరూ నన్ను సిద్ధం చేయలేదు. వారు నన్ను.. చుడైల్, కాలా జాదు కర్నే వాలీ, నాగిన్ లాంటి పేర్లతో పిలుస్తారు.. కానీ నేను దేనినీ నిజంగా పట్టించుకోను. ఇలాంటివి ఇంతకుముందు నన్ను కలవరపెట్టేవి కానీ ఇప్పుడు కాదు! అని తెలిపింది. అయితే రియా తన జీవితాన్ని తిరిగి పొందాలంటే %-%క్షమించే మార్గం%-%లో వెళ్ళవలసిందిగా భావించానని, దాదాపు బలవంతంగా ఇది జరిగిందని చెప్పింది. జరిగినదంతా క్షమించాలని నా హృదయంలో ఉంటుందని నేను అనుకోలేదు. కానీ నేను చాలా కాలంగా చాలా కోపంగా ఉన్నందున క్షమాగుణం సింపుల్ మార్గంగా మారింది. నాకు వచ్చిన కోపం అంతా గట్ సమస్యలు.. అసిడిటీ మాత్రమే. నేను దాదాపు మూడేళ్లపాటు ఎసిడిటీతో చాలా బాధపడ్డాను. క్షమాపణ ఒక్కటే ఆప్షన్‌గా మారింది. నేను దాదాపు క్షమాపణ మార్గంలోకి వెళ్ళవలసి వచ్చింది.. అని తెలిపింది. 2020లో సుశాంత్ మరణించిన తర్వాత, రియా అతడి ఆత్మహత్యకు ప్రేరేపించిందని ఆరోపణలు వచ్చాయి. మనీలాండరింగ్ ఆరోపణలపై రియాను ఆమె సోదరుడు షోక్‌ను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కేసును స్వాధీనం చేసుకున్న తరువాత, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) సుశాంత్‌కు గంజాయి సరఫరా చేశారనే ఆరోపణతో రియాను ఆమె సోదరుడిని అరెస్టు చేసింది. అయితే సుశాంత్ డ్రగ్స్ వ్యసనానికి రియా ఆర్థిక సహాయం చేసిందనే ఎన్‌సిబి సిద్ధాంతాన్ని బాంబే హైకోర్టు తిరస్కరించింది.

# సూర్య-జ్యోతిక లవ్ స్టోరీ వెరీ బోరింగ్!

సూర్య-జ్యోతికలు ప్రేమించి వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ దంపతులకు దియా-దేవ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. వృత్తి-వ్యక్తిగత జీవితంలో ఇద్దరు ఎంతో సంతోషంగా ముందుకు సాగిపోతున్నారు. ఇటీవలే చెన్నై నుంచి ముంబైకి షిఫ్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇక జ్యోతిక సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్నారు. ఓవైపు ఇంటి ఇల్లాలుగా బాధ్యతలు నెరవేరుస్తూనే....నటిగా కొనసాగుతున్నారు. ఫిట్ నెస్ పైనా దృష్టి పెట్టి ఫిట్ నెస్ ఫ్రీక్ అనిపిస్తున్నారు ఈ మధ్య కాలంలో. తాజాగా సూర్యతో జ్యోతిక లవ్ స్టోరీ చాలా బోరింగ్ అనేసింది. అవును ఈ విషయం స్వయంగా జ్యోతిక రివీల్ చేసింది. తమ జీవితాల్లో అత్యంత బోరింగ్ విషయాల్లో లవ్ కూడా ఒకటి అని అన్నారు. సూర్యను ఎందుకు పెళ్లి చేసుకోవాల్సి వచ్చిందో జ్యోతిక వివరించింది. సూర్యను నేను పెళ్లి చేసుకోవడానికి అతడు నాకు ఇచ్చిన గౌరవమే ప్రధాన కారణం. మేము తొలిసారి పూవెల్లమ్ కెట్టుప్పర్ అనే సినిమాలో కలిసి నటించాం.



నాతో చాలా క్యాజువల్ గా మాట్లాడాడు. ఆ తర్వాత ఏడు సినిమాల్లో కలిసి నటించాం. ఎవరైనా డైరెక్టర్ ఓ రొమాంటిక్ సీన్ వివరించినప్పుడు సూర్య అంత వరకే నటించేవాడు. దానిని అదునుగా తీసుకునేవాడు కాదు. ఆ గౌరవమే నన్ను ఆకర్షించింది. ఇక నేను అప్పటికే 10 ఏళ్ల పాటు షూటింగ్ లలో 9 నుంచి 6 వరకూ పని చేసీ చేసీ అలసిపోయాను. నాకు అవసరమైనంత డబ్బు అప్పటికే సంపాదించేశాను. ఆ సమయంలోనే సూర్య నాకు ప్రపోజ్ చేశాడు.నా కుటుంబం కూడా అంగీకరించింది. దీంతో మరీ ఎక్కువగా ఆలోచించకుండా ఆ తర్వాతి నెలలోనే పెళ్లి చేసుకున్నాం. ప్రేమ పక్షుల్లా ఎక్కువ కాలం ఎదురు చూడలేదు. బయట పెద్దగా కలిసింది..తిరిగతింది కూడా లేదు. అందుకే మా లవ్ స్టోరీ మాకే బోరింగ్ గా అనిపిస్తుంది అని అన్నారు.





# దీపావళి తర్వాత 'ధూం ధాం'.. టీజర్ ఎలా ఉందంటే?




టాలీవుడ్ యంగ్ హీరో చేతన్ కృష్ణ, ముద్దుగుమ్మ హెబ్బా పటేల్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ధూం ధాం. మంచి ఎంటర్టైనర్ గా సాయి కిశోర్ మచ్చ తెరకెక్కిస్తున్న ఆ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే అని పనులు పూర్తి చేసుకున్న చిత్రం.. థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఇప్పటివరకు మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ అందుకుంది. సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేసింది. మల్లెపూల టాక్సీ.., మాయా సుందరి.., టమాటో బుగ్గల పిల్ల.., కుందనాల బొమ్మ.. వంటి సాంగ్స్ చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. సినిమాపై అంచనాలు పెంచాయి. కొద్ది రోజుల క్రితం మేకర్స్ విడుదల చేసిన థీమ్ టీజర్.. ఓ రేంజ్ లో అలరించింది. అప్పటికే ఉన్న అంచనాలను మరింత పెంచేసింది. ఇప్పుడు ధూం ధాం మేకర్స్ మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. మూవీ టీజర్ ను తీసుకొచ్చారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ మారుతి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. టీజర్ చాలా ఫన్నీగా ఉందని ఆయన కొనియాడారు. మూవీ మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. టీజర్ తో పాటు సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేశారు మేకర్స్. నవంబర్ 8వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని ప్రకటించారు. అబ్బాయి ఫేస్ లో కల ఓ లెక్కలో ఉంది.. తను దగ్గరయ్యే కొద్దీ తండ్రీ కొడుకుల మధ్య దూరం పెరుగుతుంది.. నో లేడర్స్.. ఓన్లీ స్నేక్స్ అంటూ పృథ్వీరాజ్ చెబుతున్న డైలాగ్ తో టీజర్ స్టార్ట్ అయింది. అదే సమయంలో హీరో హీరోయిన్లు ఎంట్రీ ఇచ్చారు. వారిద్దరి మధ్య లవ్ ట్రాక్ ను చూపించారు మేకర్స్. ఆ తర్వాత టీజర్ యాక్షన్ మోడ్ లోకి వెళ్ళిపోయింది. నాన్న కోసం ఈ మాత్రం ధూం ధాం చేయకపోతే థ్రిల్ ఏముంటుందిరా అంటూ హీరో చెప్పిన డైలాగ్ ఆసక్తి రేపుతోంది. ఆ తర్వాత ఫుల్ కామెడీ సీన్స్ ను చూపించారు మేకర్స్. కడుపుబ్బా నవ్వించారు. వెన్నెల కిషోర్ జై బాలయ్య అంటూ నినదిస్తున్న డైలాగ్ తో టీజర్ ఫన్నీగా ఎండ్ అయింది. చేతన్ కృష్ణ, వెన్నెల కిషోర్ కామెడీ టైమింగ్ అదిరిపోయింది. చేతన్ కృష్ణ తన తండ్రి కోసం ఏదైనా చేసే కొడుకు రోల్ లో ఇమిడిపోయారు. హెబ్బా తన క్యూట్ లుక్స్ తో ఆకట్టుకున్నారు. గోపీసుందర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. మొత్తానికి మూవీ పెర్ఫెక్ట్ లవ్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ఉండనున్నట్లు టీజర్ ద్వారా క్లారిటీ వచ్చేసింది. అందరినీ ఆకట్టుకుని టీజర్ దూసుకుపోతోంది. అంచనాలను ఇంకా పెంచుతోంది. మరి ధూం ధాం మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# ఈ వారం 'పొట్టేల్'కు గట్టి పోటీనిచ్చేదెవరు?



దసరా సీజన్ అయిపోయింది.. దీపావళి సినిమాల సందడి మొదలు కాబోతోంది. అంతకంటే ఒక వారం ముందుగా అనేక చిన్న చిత్రాలు విడుదల కాబోతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు, ఏడు సినిమాలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు థియేటర్లలోకి వస్తున్నాయి. ఇవన్నీ చిన్న సినిమాలే అయినా, వాటిల్లో కొన్ని మూవీస్ ప్రమోషనల్ కంటెంట్ తో జనాల దృష్టిని ఆకర్షించాయి. ఈ శుక్రవారం విడుదలయ్యే ఆ సినిమాలేంటో ఇప్పుడు చూద్దాం. తెలుగమ్మాయి అనన్య నాగళ్ల, యువ చంద్ర కృష్ణ, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం "పొట్టేల్". 'సవారీ' ఫేమ్ సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాని అక్టోబర్ 25న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ యునిక్ ప్రమోషన్స్ తో బజ్ క్రియేట్ చేసారు. ఆల్రెడీ రిలీజైన టీజర్, సాంగ్స్, ట్రైలర్ కు ఆడియన్స్ నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. హార్డ్ హిట్టింగ్ కంటెంట్ తో రాబోతున్నట్లు శాంపిల్ గా చూపించారు. మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ వారం రిలీజ్ అవుతోన్న మరో చిన్న సినిమా 'నరుడి బ్రతుకు నటన'. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో రాబోతున్న ఈ చిత్రం కావడంతో, జనాలు దృష్టి సారించారు. ట్రైలర్ కూడా బాగానే ఉంది. శివ కుమార్, నితిన్ ప్రసన్న, శృతి జయన్, ఐశ్వర్యా అనిల్ కుమార్, వైవా రాఘవ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకి రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించారు.

ఇప్పటికే పలు ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌లో ఈ సినిమా స్పెషల్ గా స్క్రీనింగ్ చేయబడినట్లు తెలుస్తోంది. డిఫరెంట్ ప్రమోషన్స్ తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిన చిన్న సినిమా "లగ్గం". రమేశ్ చెప్పాల దీనికి దర్శకుడు. ఇందులో సాయి రోనక్, ప్రగ్యా నగ్రా, రాజేంద్రప్రసాద్, రోహిణి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ మధ్యనే విడుదలైన ఈ మూవీ ట్రైలర్ బాగానే వుంది. సినిమాని ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. దీంతో పాటుగా 'రోటీ కపడా రొమాన్స్', %జ%.202, 'సముద్రుడు', 'ఎంత పని చేసావ్ చంటి' వంటి మరో నాలుగు చిన్నా చితక చిత్రాలు థియేటర్లలోకి వస్తున్నాయి. ఇటీవల కాలంలో ఏ సినిమాకైనా మౌత్ టాక్ అనేది ముఖ్యం. కంటెంట్ బాగుందని టాక్ బయటకు వస్తే, జనాలకు చిన్న సినిమాలను కూడా థియేటర్లకు వెళ్లి చూస్తున్నారు. ఇప్పటికైతే ఈ వారం రిలీజయ్యే అర డజను చిత్రాల్లో 'పొట్టేల్' మూవీకి మంచి బజ్ వుంది. 'నరుడి బ్రతుకు నటన', 'లగ్గం' చిత్రాలు ట్రెయిలర్స్ తో అకట్టుకున్నాయి. మరి వీటిల్లో ఏవేవి ప్రేక్షకాదరణ పొందుతాయో చూడాలి.

# అనన్యకు అలాంటి ఆఫర్లే ఎందుకు?

ఇండియాలోని మిగిలిన సినిమా పరిశ్రమలతో పోల్చుకుంటే తెలుగులోనే లోకల్ అమ్మాయిలకు ఆఫర్లు తక్కువగా వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ కొందరు భామలు వరుసగా సినిమాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అలాంటి వారిలో అనన్య నాగళ్ల ఒకరు. 'మల్లేశం' మూవీతో గ్రాండ్ ఎంట్రీని అందుకున్న ఆమె.. అప్పటి నుంచి తనదైన రీతిలో మార్కును చూపిస్తూ వెళ్తోంది. అనన్య నాగళ్ల - యువ చంద్ర జంటగా 'పొట్టేల్' అనే సినిమాలో నటించారు. సాహిత్ మొత్కూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పొట్టేలు నేపథ్యంతో రాబోతుంది. ఈ సినిమాను నలభై సంవత్సరాల క్రితం ఒక గ్రామంలో జరిగిన రియల్ సంఘటనల ఆధారంగా తీశారు. ప్రచార చిత్రాలు వచ్చిన తర్వాత ఈ సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి. దీంతో అందరూ ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'పొట్టేల్' సినిమాను అక్టోబర్ 25వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ వరుసగా ప్రమోషన్ ఈవెంట్లను ప్లాన్ చేసుకుంటోంది. ఇలా ఇప్పటికే



ఎన్నో ఇంటర్వ్యూలు కూడా నిర్వహించింది. ఇందులో భాగంగానే తాజాగా అనన్య నాగళ్ల ఓ చిట్ చాట్‌లో పాల్గొంది. ఈ సందర్భంగా తనకు వస్తున్న సినిమా అవకాశాల గురించి తొలిసారిగా పెదవి విప్పింది. 'మీకు గ్లామరస్ పాత్రలు, యూత్‌ను ఎట్రాక్ట్ చేసే రోల్స్ ఎందుకు రావడం లేదు' అని తాజా ఇంటర్వ్యూలో అనన్య నాగళ్లకు ఓ ప్రశ్న ఎదురైంది. దీనికామె 'వాస్తవానికి అందరిలా నాకు కూడా యూత్‌ఫుల్ రోల్స్ చేయాలని ఉంటుంది. కానీ, చాలా మంది నాకు సీరియస్‌గా, మెచ్యూర్డ్‌గా ఉండే పాత్రలనే ఆఫర్ చేస్తున్నారు. అయినా నాకు దీనిపై ఎలాంటి కంప్లైంట్లు లేవు' అని చెప్పుకొచ్చింది. ఇదే ఇంటర్వ్యూలో అనన్య నాగళ్ల 'నాకు మంచి పెర్ఫార్మెన్స్ చేసేందుకు వీలు ఉండే రోల్స్‌ను ఆఫర్ చేస్తున్నందుకు సంతోషంగా, గర్వంగా ఫీల్ అవుతున్నాను. నేను దానికి తగ్గట్లు కంటెంట్ ఇవ్వడం వల్లే మరిన్ని ఆఫర్లను వస్తున్నాయి. అలా నేను గ్లామరస్ రోల్స్‌కు కూడా దూరం అవుతున్నాను' అని వివరించింది. మొత్తానికి అనన్య నాగళ్ల తన కెరీర్ విషయంలో చాలా క్లారిటీగా ఉందని దీని బట్టి అర్థం అయింది. ఇక, సందేశాత్మక కథతో రాబోతున్న 'పొట్టేల్' మూవీని నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్ బ్యానర్లపై నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించారు. ఇందులో అజయ్, నోయల్, ప్రియాంక శర్మ కీలక పాత్రలు చేశారు. శేఖర్ చంద్ర దీనికి సంగీతాన్ని అందించారు.

# పుష్ప 2.. అల్లు అర్జున్ స్ట్రాంగ్ ప్లాన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2' డిసెంబర్ 6న థియేటర్స్ లో రిలీజ్ కానుంది. ఐదు ఇండియన్ భాషలలో ప్రేక్షకుల ముందుకి రాబోతున్న ఈ సినిమా కోసం దేశ వ్యాప్తంగా అల్లు అర్జున్ అభిమానులు వెయిట్ చేస్తున్నారు. 'పుష్ప' మూవీ తెలుగులో కంటే హిందీలో పెద్ద హిట్ అయ్యింది. ఈ నేపథ్యంలో 'పుష్ప 2' పైన నార్త్ ఇండియాలో భారీ హైప్ నెలకొని ఉంది. ఈ మూవీ థీయాట్రికల్ బిజినెస్ కూడా భారీగానే జరిగింది. 'పుష్ప 2' రిలీజ్ కి గట్టిగా చూసుకుంటే రెండు నెలల సమయం కూడా లేదు. చిత్ర యూనిట్ ఈ మూవీ ప్రమోషన్స్ పైన పూర్తిగా ఫోకస్ చేయనుంది. సాంగ్స్ రిలీజ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీపావళికి 'పుష్ప 2' నుంచి ఏదైనా అప్డేట్ వచ్చే అవకాశం ఉందనే



మాట వినిపిస్తోంది. ఇదిలా ఉంటే 'పుష్ప 2' ప్రమోషన్స్ లో భాగంగా ఈ సారి పబ్లిసిటీ కోసం డిఫరెంట్ గా ప్లాన్ చేస్తున్నారంట. సౌత్ సినిమాలని హిందీలో రిలీజ్ చేసే సమయంలో ప్రమోషన్స్ కోసం మేగ్జిమమ్ ముంబై మాత్రమే మన హీరోలు వెళ్తున్నారు. అయితే 'పుష్ప 2' ట్రైలర్ కూడా ముంబైలో రిలీజ్ చేయనున్నారు. ఈ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ని గ్రాండ్ గా నిర్వహించడానికి ఏర్పాట్లు జరిగాయి. 'పుష్ప' సినిమాకి మెజారిటీ ఆదరణ నార్త్ ఇండియా లో వచ్చింది. ముఖ్యంగా పంజాబ్, యూపీ, బీహార్, ఎంపీ లాంటి రాష్ట్రాలలో ఎక్కువ ప్రేక్షకాదరణ లభించింది. దీనిని దృష్టిలో ఉంచుకొని అల్లు అర్జున్ 'పుష్ప 2' మూవీ ప్రమోషన్స్ కోసం ఆ రాష్ట్రాలలో మెయిన్ సిటీస్ లలో పర్యటించాలని భావిస్తున్నారంట.

అక్కడి ఆడియన్స్ దగ్గరకి నేరుగా వెళ్లి కలవడం ద్వారా మరింతగా సినిమాని చేరువ చేసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. మేకర్స్ కూడా దీనికి తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమోషనల్ క్యాంపైన్స్ ఎప్పటి నుంచి మొదలు పెడతారనేది దీపావళి తర్వాత క్లారిటీ రావొచ్చని అనుకుంటున్నారు. ఏది ఏమైనా భారీ అంచనాల మధ్యలో రాబోతున్న 'పుష్ప 2' ఏ రేంజ్ లో ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అల్లు అర్జున్ ఇమేజ్ కి కూడా ఈ సినిమా చాలా పెద్ద పరీక్ష. ఈ మూవీ సాధించే కలెక్షన్స్ బట్టి అల్లు అర్జున్ మార్కెట్ రేంజ్ ఎంతనేది కూడా డిసైడ్ అవుతుంది.



# కేటీఆర్ బాగోతం ప్రజలకు తెలుసు

హైదరాబాద్: లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులపై ఆయన స్పందించారు.

"నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన బాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు.

ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం ముందుకు వెళ్తాం." అని బండి సంజయ్ పేర్కొన్నారు.



# మిస్టరీగా మారిన.. హసీనా 'రాజీనామా లేఖ'

బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆగ్రహానికి గురైన షేక్ హసీనా.. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి దేశం వీడాల్సి వచ్చింది. అక్కడ తాజాగా మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే, ఈసారి మాత్రం దేశాధ్యక్ష పదవి నుంచి మొహమ్మద్ షహాబుద్దీన్ వైదొలగాలని డిమాండు చేస్తూ అధ్యక్ష భవనం 'బంగాభబన్'ను ఆందోళనకారులు చుట్టుముట్టారు. ఇందుకు షేక్ హసీనా 'రాజీనామా లేఖ' కారణమయ్యింది. ఆ లేఖ గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు తాజా దుమారానికి తెరలేపాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..! బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమ్మద్ షహాబుద్దీన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ఆ రోజు షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసినట్లు విన్నాను.

అయినప్పటికీ దానిని ధ్రువీకరించేందుకు రాజీనామా లేఖ సహా నా దగ్గర ఎటువంటి ఆధారాలు లేవు. ఎంత ప్రయత్నించినా ఆ లేఖ లభ్యం కాలేదు. బహుశా లేఖ ఇచ్చేందుకు ఆమె (షేక్ హసీనా)కు సమయం ఉండకపోవచ్చు" అని పేర్కొన్నారు. ఇదే విషయంపై సైన్యాధిపతిని వాకబు చేయగా అక్కడ నుంచీ ఇదేవిధమైన సమాధానం వచ్చిందన్నారు. హసీనా రాజీనామా లేఖ గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై తాత్కాలిక ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు విరుద్ధ ప్రకటనలు చేశారని ప్రస్తుత ప్రభుత్వ న్యాయ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ పేర్కొన్నారు. "తన వద్ద హసీనా రాజీనామా లేఖ లేదని అంటున్నారు. ఆగస్టు 5న త్రివిధదళాధిపతుల సమక్షంలో జాతినుద్దేశించిన ప్రసంగంలో హసీనా రాజీనామా చేశారని.. తాను ఆమోదించానని అధ్యక్షుడు చెప్పారు. ఇప్పుడు మాత్రం తనవద్ద ఆ లేఖ లేదని చెబుతున్నారు" అని చెప్పారు. ఇదిలాఉంటే, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో బంగ్లాదేశ్ ఇటీవల అట్టుడుకిపోయింది. అవి హింసాత్మకంగా మారడం, దాదాపు 300 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో షేక్ హసీనా అధికార నివాసాన్ని ఆందోళనకారులు ముట్టడించారు. దీంతో ఆగస్టు 5న దేశాన్ని వీడిన హసీనా.. భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు. అనంతరం బంగ్లాలో కొత్త ప్రభుత్వం ఏర్పడి.. పరిస్థితులు కుదుటపడుతోన్న సమయంలోనే హసీనా రాజీనామా గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరోసారి ఆందోళనలకు కారణమయ్యాయి.



# మూసీ బాధితులకు అండగా ఉంటాం

## మూసీ పరివాహక ప్రాంతంలో భాజపా నేతల పర్యటన

మల్కాజిగిరి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతాపూర్‌లోని బాలకృష్ణానగర్‌లో మూసీ పరివాహక ప్రాంతాన్ని భాజపా ప్రతినిధి బృందం పరిశీలించింది. ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, శిల్పారెడ్డి, స్థానిక కార్పొరేటర్ అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లను కూల్చివేస్తారనే ప్రచారం జరుగుతోందని.. తమను ఆదుకోవాలని ఈటల రాజేందర్‌ను స్థానికులు కోరారు. దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తున్నామని.. ఇక్కడి నుంచి పొమ్మంటే ఎక్కడికి వెళ్లాలని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని భాజపా నేతలు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఎన్నో కష్టాలు పడి ఇళ్లు కట్టుకున్న వారిని ఆందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు. 30-40 ఏళ్ల పాటు కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇళ్లు కట్టుకున్నారని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. శని, ఆదివారం వస్తే చాలు.. వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూలగొడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బాధితులకు మద్దతుగా ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తామన్నారు. పేదల జీవితాలతో ఆటలు వద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# జగిత్యాల ఎపిసోడ్‌పై మంత్రి శ్రీధర్ బాబు స్పందన



హైదరాబాద్, అక్టోబర్ 23: జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడి హత్య, ఆ తరువాత జరిగిన పరిణామాలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. జగిత్యాలలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి మర్డర్‌పై సీరియస్‌గా ఉన్నామన్నారు. మర్డర్ ఎవరు చేసినా.. ఎవరు చేయించినా వదిలేది లేదని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందని తెలిపారు. జీవన్ రెడ్డితో ఇప్పటికే పీసీసీ చీఫ్ మాట్లాడారని తెలిపారు. "జీవన్ రెడ్డితో నేను కూడా మాట్లాడుతా" అని మంత్రి చెప్పారు. జీవన్ రెడ్డి పార్టీలో అత్యంత సీనియర్ నేత అని... ఆయన సేవలను తాము వినియోగించుకుంటామన్నారు. పార్టీలో జీవన్ రెడ్డి గౌరవానికి భంగం కలిగించమని వెల్లడించారు. చనిపోయిన బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

**నాకెటువంటి సంబంధమూ లేదు: ఎమ్మెల్యే..** "జీవన్ రెడ్డి కంటే ముందే మా కుటుంబం కాంగ్రెస్‌లో ఉంది. గంగారెడ్డి హత్యకు నాకు సంబంధం లేదు" అని ఎమ్మెల్యే సంజయ్ స్పష్టం చేశారు. వేరే కారణాలతోనే గంగారెడ్డి హత్య జరిగిందన్నారు. గంగారెడ్డి హత్యతో కొందరు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. తాను జగిత్యాల అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. గంగారెడ్డి హత్యపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాల్సిందే అని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు. మరోవైపు ముఖ్య అనుచరుడు గంగారెడ్డి హత్యతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. గంగారెడ్డి హత్యకు నిరసనగా జగిత్యాలలో నిరసనలు కూడా చేపట్టారు. ఒకనొక సమయంలో పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు జీవన్ రెడ్డి. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడే సమయంలోనూ ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. "నా 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ మంచి బహుమతి ఇచ్చింది. పార్టీలో కొనసాగడం సాధ్యం కాదు. ఇంతకాలం మానసికంగా అవమానాలకు గురైనా భరించా. ఇప్పుడు భౌతిక దాడులకు పాల్పడుతురు. దయచేసి నన్ను క్షమించండి అన్నా" అంటూ జీవన్ రెడ్డి ఫోన్ కట్ చేశారు. అంతేకాకుండా... "మీ పార్టీకి.. మీకు ఓ దండం.. మీ పార్టీలో నేను ఇక ఉండను.. ఇక నైనా బతక నివ్వండి" అంటూ విప్ లక్ష్మణ్ కుమార్‌తో వ్యాఖ్యలు చేశారు. అయితే గంగారెడ్డి హత్యతో జగిత్యాల జిల్లాలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. హత్యకు నిరసనగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిరసనకు దిగారు. జగిత్యాలలోని పాత బస్టాండ్ ఆవరణలో నడి రోడ్డుపై కూర్చొని ఆందోళనకు దిగారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కూడా జీవన్‌రెడ్డితో కలిసి ఆందోళనకు దిగారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఎమ్మెల్సీ ధర్నా చేశారు. మరోవైపు గంగారెడ్డిని హత్య చేసిన నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అలాగే నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కాల్ డేటా, వాట్సాప్ డేటాను పరిశీలిస్తున్నారు. అలాగే పోలీసులతో నిందితుడికి సంబంధాలపై విచారణ కొనసాగుతోంది.







# హెచ్‌సీఏ వివాదాలపై సుప్రీంకోర్టులో విచారణ

న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఇవాళ (బుధవారం) విచారణ జరిగింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ప్రత్యేక బెంచ్ వాదనలు విన్నది. ఈ కేసు తదుపరి విచారణను రేపు (గురువారం) మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తూ బెంచ్ నిర్ణయించింది. కాగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎలక్ట్రోరల్ జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ కోసం గతంలో జస్టిస్ ఎల్ నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించింది. హెచ్‌సీఏకి ఎన్నికలు నిర్వహించడమే కాకుండా.. నిర్వహణపై సిఫార్సులు చేయాలని జస్టిస్ ఎల్ నాగేశ్వరరావుకు సూచించింది. అయితే హెచ్‌సీఏ సభ్యుల్లో ఎక్కువ మంది కుటుంబ సభ్యులేనని ఆయన చేసిన సిఫార్సుపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ మేరకు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. వారి పిటిషన్లపైనే ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతోంది. కాగా హెచ్‌సీఏలో కుటుంబ సభ్యులే ఎక్కువ మంది మెంబర్లుగా ఉన్నారని సుప్రీంకోర్టు దృష్టికి జస్టిస్ నాగేశ్వరరావు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉండడంతో హెచ్‌సీఏ ఎన్నికల నిర్వహణలో పలు అంశాలు ప్రభావితం అవుతున్నాయని ఆయన చెప్పారు. అయితే మెంబర్లు మాత్రం ఈ వాదనను వ్యతిరేకిస్తున్నారు.

**హెచ్‌సీఏపై ఆరోపణలు :** హెచ్‌సీఏలో కాంట్రాక్టుకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు జరపాలనే డిమాండ్ గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. టెండర్ ప్రక్రియ, క్యాటరింగ్, ట్రావెలింగ్ సర్వీసులతో పాటు ఇతర అంశాలపై సమగ్ర అంశాలు బయటకు తీయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఇటీవలే స్పందించారు. హెచ్‌సీఏకి సంబంధించిన పలు అంశాలపై దర్యాప్తు జరపాలంటూ విజిలెన్స్ అదనపు డీజీకి లెటర్ రాశారు. హెచ్‌సీఏ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఈ విధంగా నిర్ణయాలు తీసుకోవడం అసోసియేషన్ పనితీరును ప్రభావితం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కీలకమైన అపెక్స్ కౌన్సిల్‌తో అవసరం మేరకు సంప్రదింపులు జరపకుండా కొంతమందే నిర్ణయాధికారాలు (ప్రెసిడెంట్, సెక్రటరీ) తీసుకుంటున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. టెండర్ లేకుండా ఐపీఎల్ కాంట్రాక్టులు అప్పగించడం హెచ్‌సీఏ ప్రతిష్ఠకు మసకబార్చుతాయని పేర్కొన్నారు.


# కాళేశ్వరం విచారణ.. ఈఎన్‌సీపై ప్రశ్నల వర్షం



హైదరాబాద్, అక్టోబర్ 23: కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ కొనసాగుతోంది. బుధవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ ఈఎన్‌సీ నాగేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్‌పై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. దాదాపు మూడు గంటల పాటు 130కి పైగా ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్లు కమిషన్ ముందు చెప్పారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. అలాగే వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదని ఎవరు ఆదేశించారని నాగేందర్‌ను క్వశ్చన్ చేసింది. పరిమితికి మించి మ్యారేజీల లో నీళ్లను స్టోర్ చేయమని ఎవరు ఆదేశించారని కమిషన్ అడిగింది. మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ మాన్యువల్ ప్రిపేర్ చేసిందా అంటూ ఈఎన్‌సీ నాగేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించింది.

**కమిషన్ ప్రశ్నలు.. నాగేందర్ సమాధానాలు :** రామగుండం ఈఎన్‌సీ నిబంధనలు పాటించలేదని కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పినట్లు తెలుస్తోంది. రామగుండం ఈఎన్‌సీ స్టేట్ అండ్ సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదన్నట్లుగా కమిషన్ ముందు చెప్పారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లనే మూడు బ్యారేజీలు డ్యామేజ్ అయ్యాయా అని కమిషన్ ప్రశ్నించగా.. 2021 జనవరి వరకు ఆపరేషన్ సైన్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేకమైన సిబ్బంది లేరని కమిషన్ ముందు నాగేందర్ తెలిపారు. 2021 జనవరిలో ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ టీం ఫామ్ అయిన తర్వాత రామగుండం ఈఎన్‌సీకి రిపోర్టు ఇచ్చామని తెలిపారు. ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ ఇచ్చిన రిపోర్ట్స్ పై ఎలాంటి యాక్షన్ రామగుండం ఈఎన్‌సీ తీసుకోలేదన్నారు. ఓ అండ్ ఎం ఇన్స్పెక్షన్ రిపోర్టును కమిషన్‌కు ఈఎన్‌సీ నాగేందర్ సబ్మిట్ చేశారు. సీడబ్ల్యూసీ మాన్యువల్ నిబంధనలు ఫాలో చేశారని కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఫాలో చేయలేదని నాగేందర్ సమాధానం ఇచ్చారు. "%×ూ జూణజు% పాటించారా?" అని అడుగగా.. లేదని ఆన్సర్ ఇచ్చారు. డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించారని అధికారులను కాళేశ్వరం కమిషన్ అడిగింది. నిర్మాణ సంస్థలు అగ్రిమెంట్ ఆపరేషన్స్ ప్రోటోకాల్ డ్యామ్ సేఫ్టీ ఆక్ట్ ఫాలో అయ్యారా అన్న ప్రశ్నకు కాలేదని నాగేందర్ సమాధానం చెప్పారు. వెథర్స్ షెడ్యూల్ ఫాలో అయ్యారా అని ప్రశ్నించగా.. దానికి కూడా కాలేదనే ఈఎన్సీ సమాధానం చేశారు. మూడు బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేశారా అని కమిషన్ ప్రశ్నించగా.. 2019 నుంచి మూడు బ్యారేజీలలో పరిమితి నీళ్లను నిలువ చేసినట్లు కమిషన్ ముందు నాగేందర్ వెల్లడించారు. ప్రమాదం జరిగే ముందు ఓ అండ్ ఎం పరిశీలన చేశారా అని.. బ్యారేజీలలో నీళ్లను నిలువ చేయాలని ఎవరు? ఆదేశించారంటూ కమిషన్ అడిగిన క్వశ్చన్‌కు... రామగుండం ఈఎన్సీకి మౌకిక ఆదేశాలు ఉన్నాయి అన్నట్లుగా కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పుకొచ్చారు.

# పరువునష్టం దావా కేసులో వాంగ్మూలం ఇచ్చిన కేటీఆర్



హైదరాబాద్: పరువునష్టం దావా కేసులో మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లి కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. దాదాపు 20 నిమిషాల పాటు ఆయన స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డు చేసింది. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో తన పరువు ప్రతిష్టలు దెబ్బతిన్నాయని, పబ్లిసిటీ కోసమే ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. కేటీఆర్ వెంట సాక్షులు దాసోజు శ్రవణ్, సత్యవతి రాథోడ్, బాల్కసుమన్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాంపల్లి కోర్టుకు వచ్చారు. కేటీఆర్‌తో పాటు దాసోజు శ్రవణ్ వాంగ్మూలాలు నమోదు చేసిన నాంపల్లి కోర్టు.. మిగిలిన సాక్షుల వాంగ్మూలాలను ఈనెల 30న నమోదు చేయనుంది.

# తెలంగాణలో బీసీ కులగణనపై వీహెచ్ కీలక కామెంట్లు..

హైదరాబాద్: తెలంగాణలో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 13 వరకూ బీసీ కులగణన చేపట్టనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. ఈనెల 28నుంచి అధికారుల ఇళ్లకు వస్తారని, వారు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను సూచించారు. కులగణన జరగాలని చెప్పిన ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని, గణన జరిగితే వెనకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన ఎప్పుడో చెప్పాలని మాజీ ఎంపీ అన్నారు. రైతులు, విద్యార్థులు ఇలా అందరి సమస్యలు తెలిసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. " కులగణన చేసేందుకు గ్రామాలకు, మండలాలకు అధికారులు వస్తారు. ప్రజలు వివరాలు ఇచ్చి సహకరించాలి. బీసీ కులగణన జరిగితే వారి జనాభా ఎంతో తెలుస్తుంది. ఎస్సీ, ఎస్టీలు అందరూ వారి జనాభా తెలియాలని అడుగుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన తెలంగాణలో మొదలుపెట్టారు. గతంలో మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చారు. బీసీల పిల్లలు ఐఐటీ, ఐఐఎంలో చదువుతున్నారు.

అందరూ కులగణనను వినియోగించుకోవాలి. వివరాలు ఇవ్వడం ద్వారా పంచాయతీ, మేయర్ ఎన్నికల్లో అందరికీ అవకాశం ఉంటుంది. ప్రధాని మోదీ పదేళ్ల నుంచి అధికారంలో ఉన్నారు. కానీ ఆయన ఇంతవరకూ కులగణన చేయలేదు. గణన జరిగితే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ వస్తుంది" అని చెప్పారు. మరోవైపు బీసీ కులగుణనపై తెలంగాణ హైకోర్టు సెప్టెంబరు 10న కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల్లో కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# కేటీఆర్ లీగల్ నోటీసుపై బండి సంజయ్ ఘాటు జవాబు

హైదరాబాద్, అక్టోబర్ 23: తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కేంద్రమంత్రి బండిసంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపిన విషయం తెలిసిందే. తాజాగా కేటీఆర్ లీగల్ నోటీసుపై కేంద్రమంతి ఘాటైన జవాబిచ్చారు. "తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. రాజకీయంగా ఎదుర్కోలేక నోటీసులా.. విమర్శలకు నోటీసులే సమాధానమా.. అయితే నీకు నోటీసులు పంపుతా... కాచుకో. నువ్వు సుద్దపూస అనుకుంటున్నవా.. నన్ను అవమానిస్తూ మాట్లాడితేనే బదులిచ్చిన. మాటకు మాట... నోటీసుకు నోటీసుతోనే జవాబిస్తా" అంటూ స్ట్రాంగ్ ఆన్సర్ ఇచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ తనకు లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో చూసినట్లు తెలిపారు. లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీస్ ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోందని... తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తనపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే అని చెప్పుకొచ్చారు. అందుకు బదులుగానే మాట్లాడినట్లు తెలిపారు. ఆయన సుద్దపూస అనుకుంటున్నాడేమో.. ఆయన భాగోతం ప్రజలకు తెలుసు అంటూ అంటూ కేటీఆర్‌పై సెటైర్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసన్నారు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చానని.. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తానని వెల్లడించారు. " మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం... చట్టం, న్యాయం ప్రకారం కూడా ముందుకు వెళతాం" అని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్రమంత్రి బండి సంజయ్ పత్రికా ప్రకటనను విడుదలచేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com